
# మేలెరిగిన మనిషి



నారంశెట్టి ఉమామహేశ్వరరావు

Scanned with CamScanner

# మేలెరిగిన మనిషి

బాలల కథాసంపుటి

రచన: నారంశెట్టి ఉమామహేశ్వరరావు

ప్రథమ ముద్రణ: 2010

కాపీలు: 1000

వెల: 50/-

హక్కులన్నీ గ్రంథకర్తలవి.

ముఖచిత్రం :- **శ్రీతుంబలి శివాజి,** 98492 27509

ప్రతులకు:

1) **జి.అమ్మాజి,** ఎమ్.ఏ.బి.ఎడ్.,
W/o. **ఎన్.ఉమామహేశ్వరరావు,** ఎమ్.ఏ. పోస్టల్‌ఇన్స్‌పెక్టర్,
సరస్వతీనివాస్, గవర్నమెంట్ హాస్పిటల్‌రోడ్, బెలగాం,
పార్వతీపురం హెచ్.ఓ. - 535501
విజయనగరం జిల్లా. ఆం.ప్ర
మొబైల్: 9490799203, [redacted] 9985359091

2) **జట్టు సేవాశ్రమం,** రాయగడరోడ్,
పార్వతీపురం హెచ్.ఓ-535501
మొబైల్: [redacted]

3) **విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,**
4-1-435, విజ్ఞాన భవన్, అబిడ్స్, హైదరాబాద్-1
మరియు అన్ని బ్రాంచీలు.
ఫోన్: 24744580, 24735905

ప్రచురణ:

**జట్టు సేవాశ్రమం, రాయగడరోడ్, పార్వతీపురం**



Scanned with CamScanner

# అంకితం



**కీ.శే. నారంశెట్టి గంగయ్య, సావిత్రమ్మ దంపతులు**

**కాలంతో పనిలేనిది మరణం! కలకాలం నిలిచేది స్మరణం!**

అమ్మా! నువ్వు గుర్తుకొస్తే చాలు
తినిపించిన గోరుముద్దలే కాదు.
దిద్దించిన అక్షరాలూ
దిగంతాల దొంతరలో అంతర్ధానమైన నిన్ను
సాక్షాత్కారం చేస్తాయి!
నీ స్మృతిగీతాలు కన్నీటి కవిత్వమై
సంస్మరణ ఆలాపనగా నన్ను ఓదార్చుతాయి!
నాన్నా! నువ్వు తలపుకు వస్తే చాలు
తగిలించిన దెబ్బలే కాదు
తొడిగించిన మమతల దుస్తులు
నన్ను బాల్యపు జ్ఞాపకాలరథంపై ఊరేగిస్తాయి!
ఆశ్చర్యంగా రూపంలేని మనసు
ఘనీభవించిన మంచుశిల్పంలా
చల్లగా ద్రవీకరించి లాలపోస్తుంది!
ఆ తడి నా జీవితపర్యంతం ఆరిపోనిది
మీ అనురాగం తీరిపోనిది.

మీ నడిపోడు
**నారంశెట్టి ఉమామహేశ్వరరావు**

బాలల్లారా!

"నేటి బాలలే రేపటి పౌరులు" అన్నది జగమెరిగిన సత్యం అని మీకు తెలుసుకదూ! అంటే నేడు మీరు బాలలుగా ఉన్నారు. కాలక్రమేణా పెరిగి పెద్దవారవుతారు. అప్పుడు మీరు "పౌరుల"వుతారు. ఇది తరతరాల నుండీ జరుగుతున్న పరిణామం.

ఇంకో విషయం ఇప్పుడు పౌరులుగా ఉన్న మీ అమ్మానాన్నా లేక బావ, మామయ్యలు ఒకప్పుడు బాలలేనన్నమాట. అదిగో అటువంటి "నేటిపౌరు"లైన ఒకప్పటి "బాలల" కోసం రాయబడినవే ఈ కథలు.

కథలు ఎప్పటికీ కథలే! ప్రతితరం బాలలూ చదివి ఆనందించదగ్గవే! ఉదాహరణకు మీరు పంచతంత్రకథలు, ఈసపు కథలు మొదలైన కథలు చదివే ఉంటారు... ఈ కథలన్నీ ఎన్నో శతాబ్దాల క్రితం రాయబడినవైనా తరతరాల బాలల్ని తీర్చి దిద్దుతూ వస్తున్నాయి. అంటే కథలకు "సర్వకాలీనత" అనేది ఉన్నదన్నమాట..

ఇదిగో ఇప్పుడు మీరు చదవబోయే కథలు ఇంచుమించు 30 సంవత్సరాల క్రితం బాలల పత్రికలలో అచ్చయినవే! అంటే ఇప్పటి పౌరుల్లో కొందరైనా వీటిని చదివి ఉండవచ్చునన్నమాట.

ఆ కాలంలో బాలల కోసం బాలజ్యోతి, బాలరంజని, బాలమిత్ర, బుజ్జాయి, బొమ్మరిల్లు, బాలచంద్రిక, చిన్నారిలోకం మొదలైన పత్రికలు వచ్చేవి. అలాగే కొన్ని పేరు పొందిన దినపత్రికలు, వారపత్రికలు, బాలల కోసం శీర్షికలు నిర్వహించి, బాలలకు వినోదాన్నీ, తద్వారా వికాసాన్నీ కలిగించేవి.

అప్పుడు ఆయా పత్రికలలో ప్రచురించబడ్డ ఈ కథలన్నీ పత్రికలలో అలాగే ఉండిపోయాయి. వాటిని గురించి ఈతరం బాలలకు తెలిసేది కాదన్నమాట. ఆ కథలే పుస్తక రూపంలో ఉంటే ఏపౌర గ్రంథాలయాల లోనో, ఏ పాఠశాల గ్రంథాలయాలలోనే ఉండిపోయేవి. ప్రతితరం బాలలూ చదువుకోవటానికి అందుబాటులో ఉంటాయి.

ఈ సంగతి గ్రహించిన మన ఉమామహేశ్వరరావు గారు, ఆనాడు పత్రికలలో వచ్చిన కథల్ని, ఈనాడు ఇలా పుస్తకరూపంలో తీసుకు వస్తున్నారు. వీరు ఈ పని ఎప్పుడో చేయవలసింది. ఆలస్యంగానైనా తెలుసుకొని పుస్తకరూపంలో తీసుకువస్తున్నారు. అందుకు మనం అభినందించాల్సిందే!

ఈ పుస్తకంపేరు "మేలెరిగిన మనిషి". పేరు బాగా ఉందికదూ! ఇది పెద్ద కథే! అయినా ఎన్నెన్నో మలుపులతో చదివేవారికి విసుగు కలుగకుండా చదివిస్తుంది. కథపేరులోనే ఉంది ఆకట్టుకొనే గుణం.... మేలెరిగిన మనిషి మంచివారికి మాత్రమే మేలుచేస్తారు. "మంచితనంతో మసలుకొనేవారికి, అన్నివిధాలా మంచే జరుగుతుంది." అన్న సందేశాన్ని ఈ కథ ఇస్తుంది.

ప్రతి కథ ద్వారా ఏదో ఒక మంచి సందేశాన్ని అందించటం ఉమామహేశ్వరరావుగారు చేసిన గొప్ప పని. "ఎన్నిక" అనే కథ ఉంది. బుద్ధిబలం ఎంత గొప్పదో ఈ కథ ద్వారా మనం తెలుసుకుంటాం!

ఇక మూడవ కథ "చిక్కుప్రశ్నలు" కూడా బుద్ధిబలాన్ని తెలిపే కథే!

తనకు సహాయం చేయని తన స్నేహితుడికి సహాయం చేయటం మనం "అల్పబుద్ధి" అన్న కథలో తెలుసుకుంటాం! "ఎదుటివారిని చూచి ఓర్వలేక పోతే నష్టం జరుగుతుంది" అన్నసత్యాన్ని "దురాశ" కథ తెలుపుతుంది. బుద్ధిబలాన్ని గురించే మరొక కథ "తెలివైన కోతి"

తెలుపుతుంది.

మిగతా కథలన్నీ కూడా రకరకాల మలుపులతో సాగుతాయి. అవి ఏదో ఒక సందేశాన్ని అందించి మీలో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయి అనటంలో సందేహం లేదు.

ప్రస్తుతం మీరు చదువుకోవటానికి ఎన్నో కథల పుస్తకాలు ఉన్నాయి. "కథలను బాలలచేత ఆసక్తిగా చదివించాలి. చివరకు వారికి మేలుచేసే ఏదో ఒక సందేశాన్ని అందించాలి" అన్న లక్ష్యంతో మిత్రులు ఉమామహేశ్వరరావు గారు, మంచిఉద్దేశ్యంతో ఈ కథలు రాశారు. ఎప్పుడో రాసిన కథల్ని ఇప్పటికైనా ధైర్యంచేసి పుస్తకరూపంలో అందిస్తున్నారు. ఇంకా వీరు రాసిన కథలు ఎన్నో ఉన్నాయి. వాటినన్నిటినీ ఏదో ఒక రూపేణా పుస్తకాలుగా అందిస్తే మనకు ఎంతో మేలు జరుగుతుంది.

బాలలూ! చివరగా ఒక మంచిమాట!.

మీరు చదువుకుంటున్నారు కదూ! ఆ చదివే చదువులో మంచి మార్కులు తెచ్చుకోవటానికి ఎంతో కష్టపడుతున్నారు. అప్పుడప్పుడూ అటువంటి కష్టాల నుండి దూరంగా ఉండాటానికి వీలుచూసుకొని ఇదిగో ఇటువంటి కథల పుస్తకాలు చదువుతూ ఉండాలి. "బాలసాహిత్యం" అన్నది మీకోసం ఏర్పడిన సాహిత్యమే! మీ పాఠ్యపుస్తకాలనయితే ఉపాధ్యాయుల సహకారంతో చదవవలసి ఉంటుంది. అలాకాకుండా బాలసాహిత్యం మీరు స్వయంగా చదివి తేలికగా అర్థంచేసుకో గలిగిన స్థాయిలో ఉంటుంది. ఇది మీ కోసం ఏర్పడిన సాహిత్యమే!


"ఆఁ! మాకు టెలివిజన్లు లేవా? వాటితో ఆనందాన్ని పొందలేమా?" అని టెలివిజన్ల గొప్పదనం గురించి మీరు ఆలోచిస్తూ ఉండవచ్చు.

కాని ఒక్క విషయం ఆలోచించండి. మీరు ఏ పార్కుకో లేదా మరోచోటుకో వెళ్ళినప్పుడు టి.వి.లను వెంటబెట్టుకు వెళ్ళగలరా? అది కష్టసాధ్యమైనపని. అదీగాక విద్యుచ్ఛక్తి లేనప్పుడు టి.వి.లు పనిచేయవు కదా!

కాని సులభంగా చేతిలోనో లేక ఏ సంచిలోనో తీసుకుపోగలగింది పుస్తకం. ఎక్కడకు వెళ్ళినా పుస్తకాలు మనవెంట ఉంటే అవే మనకు స్నేహితుల్లా సహాయం చేస్తాయి. మనకు తోడుగా ఉంటాయి. ఇటువంటి విలువైన పుస్తకాలను తృణీకరించకండేం!

మనపెద్దలు ఎందరో ఎన్నో పుస్తకాలు చదివి "స్ఫూర్తి" ని పొందారు. అలా మీరు కూడా పుస్తకాల ద్వారా..మంచి స్ఫూర్తిని పొంది ఉన్నతులవుతారని, నేనూ ఈ పుస్తకం రచయితా, మరెందరో మీకోసమే ప్రత్యేకంగా రాసే రచయితలు ఆశిస్తూ ఉన్నారు. ఆ ఆశయాన్ని వమ్ము చేయకండేం!

ముందుగా మనం చెప్పుకున్నాం! మంచి కథల్ని మనకు అందించిన నారంశెట్టి ఉమామహేశ్వరరావు గారిని అభినందించాం! వారి దగ్గర ఇంకా ఎన్నో కథలు ఉన్నాయి. వాటినన్నినీ త్వరలో పుస్తకాలుగా అందించాలని ఆశిద్దాం!



ఇట్లు
కథల తాతయ్య
**రెడ్డి రాఘవయ్య.**



Scanned with CamScanner

# కథావళి


1) మేలెరిగిన మనిషి ........ 13
2) ఎన్నిక ........ 27
3) చిక్కుప్రశ్నలు ........ 30
4) అల్పబుద్ధి ........ 32
5) దురాశ ........ 34
6) చిలుక సమాధానం ........ 36
7) తెలివైన కోరిక ........ 38
8) కాలనిర్ణయం ........ 40
9) ముసుగువీరుడు ........ 42
10) చిలుకజోస్యం ........ 52
11) తాయెత్తుమహిమ ........ 54
12) దురాశకి మిగిలేదంతే ........ 56
13) మూడు-ఆరు ........ 58
14) శుభం ........ 60
15) లెక్కసరిపోయింది ........ 63
16) పరివర్తన ........ 66
17) స్వయంవరం ........ 69
18) పరీక్ష ........ 72
19) కనువిప్పు ........ 74




Scanned with CamScanner

# మేలెరిగిన మనిషి



పూర్వం రాజయ్యపేట అనే వూరిలో ఒక రైతు నివసిస్తూ వుండేవాడు. అతడికి ముగ్గురు కొడుకులు. రంగయ్య, భీమయ్య, సోమయ్య, ఆఖరివాడైన సోమయ్య చాలా చురుకైనవాడు, అందమైనవాడు, మంచివాడు.

పెద్దవాళ్ళు యిద్దరూ చాలా దుష్టులు, పిసినారులు. అందుకే సోమయ్య అంటే వారికి గిట్టేది కాదు. ఆ వూరి ప్రజలు సోమయ్య అంటే చాలా ప్రేమ చూపించేవారు. మిగతా యిద్దరిపైన అయిష్టత చూపేవారు.

ఒకనాడు అన్నలిద్దరూ పొరుగూరికి ప్రయాణమై సోమయ్యను పొలం చూడమని పంపారు. సోమయ్య పొలం చూడడానికి వెడుతుండగా మధ్యలో ఒక కాలవ దాటవలసి వచ్చింది. కాలవ దాటే ముందు సోమయ్యకు బురదలో ఏదో వస్తువు మెరుస్తూ కనిపించింది.

ఆగి పైకి తీసి చూశాడు.

సోమయ్య తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు. అది ఒక చిన్న బంగారపుపెట్టె. ఆ పెట్టెను నీటిలో కడిగి దాని మూత తెరిచాడు. దానిలో

బంగారుకాంతితో మెరిసిపోతున్న గుండ్రటిపళ్ళెం ఒకటి కనిపించింది. ఆ పళ్ళెంపై 'మేలెరిగినమనిషి' అని అక్షరాలు వున్నాయి. సోమయ్య ఆ అక్షరాలను పైకి చదివేసరికి ఎదుట ఒక మనిషి ప్రత్యక్షమయ్యాడు.

అతడు "నేనే మేలెరిగిన మనిషిని. నేను ఈరోజు నుంచి నీ సేవకుడను. ఏ అవసరం వచ్చినా, ఏ అపాయంలో చిక్కుకొన్నా నన్ను పిలువు. నేను ప్రత్యక్షమయి నీకు కావలసిన పని చేస్తాను. నేను ప్రత్యక్షమయితే వృధాగా తిరిగిపోను. ఏదైనా పని చెప్పు. ఇట్టే చేసేస్తాను" అన్నాడు.

సోమయ్య 'ఇదంతా కలా? నిజమా?' అనుకొన్నాడు. అతడు చాలాసేపటిదాకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేకపోయాడు.

సోమయ్య ఆశ్చర్యం నుంచి తేరుకుని ఇలా అన్నాడు. "మా పొలం అంతా తిరిగి వచ్చేసరికి చాలా సేపు పడుతుంది. ఇక్కడ నుంచి పొలం అంతా చూసేటట్లు చెయ్యి."

అలాగే చేశాడు మేలెరిగిన మనిషి. "పొలం అంతా తడుపు" అన్నాడు తిరిగి సోమయ్య. మేలెరిగిన మనిషి ఆపని కూడా చేశాడు.

సోమయ్య 'బంగారు పెట్టె' ను తమ పొలంలో ఒక చోట గొయ్యి తవ్వి దానిలో దాచాడు. పని చూసుకొని ఇంటికి బయల్దేరాడు. బంగారు పెట్టె విషయం అన్నలకు చెప్పలేదు.

## 2

అన్నలు తనపై ఎంత కోపంగా వున్నప్పటికీ మరింత వినయంగా తిరుగుతున్నాడు సోమయ్య. కొన్నిసార్లు సోమయ్యకు తిండి కూడా పెట్టేవారు కాదు అన్నలు.

సోమయ్య తన అన్నలు చూడకుండా పొలం వెళ్ళి 'మేలెరిగిన మనిషి'ని పిలిచి ఆహారం ఇమ్మని అడిగేవాడు. అంతే! మేలెరిగిన మనిషి పంచభక్ష్య పరమాన్నాలతో భోజనం పెట్టేవాడు.

సోమయ్య తృప్తిగా భోజనం చేసి మేలెరిగిన మనిషికి కృతజ్ఞతలు చెప్పేవాడు.



Scanned with CamScanner



దానికి అతడు "నీవు నాకు కృతజ్ఞతలు చెప్పవద్దు. నా యజమాని అవసరాలు తీర్చడం కోసమే కదా నేను వున్నది" అని చెప్పి అదృశ్యమయ్యేవాడు.

కొన్నిరోజుల తర్వాత సోమయ్యతండ్రి చనిపోయాడు. తండ్రి చనిపోయిన తరువాత సోమయ్యకు తిండి అసలే పెట్టేవారు కాదు అన్నలు. అన్నలిద్దరూ ఆస్తిని పంచుకొని ఏదో కొంచెం భాగం సోమయ్యకు ముట్టజెప్పారు. మంచివాడైన సోమయ్య అన్నలిచ్చిన భాగమే తీసుకున్నాడు.

సోమయ్య తన పొలం పనిచేస్తూ కాలం గడుపుతుండేవాడు. సోమయ్య తనకున్న దానిలోనే దానాలు చేసేవాడు. అన్నలు తమకు అవసరమైన వస్తువులు సోమయ్య దగ్గర నుంచి తీసుకుపోయేవారు. కాని తిరిగి ఇచ్చేవారు కాదు. సోమయ్యకు యిచ్చిన ఆస్తి చాల తక్కువ. దానిలోనే అతడు దానాలు చేయడంతోటి, మంచిమాటలు చెప్పి అన్నలు తమకు కావలసిన వస్తువులు తీసుకుపోవడంతో అతని ఆస్తి కర్పూరంలా కరిగిపోయింది. పొలం మాత్రం కొద్దిగా మిగిలింది.

తమ వూరిలో తండ్రి పేరున దేవాలయం కట్టడానికి నిర్ణయించుకున్నాడు సోమయ్య. వెంటనే అతడు పొలం అమ్మేసి ఆ ధనంలో కొంత భాగం పెట్టి వూరిలో కొంత స్థలం కొన్నాడు. 'మేలెరిగిన మనిషి' సహాయంతో ఒక్కరోజులో దేవాలయం కట్టించగలడు. కాని అతడు అలా చేయక తనవద్ద వున్న ధనంతో దేవాలయం కట్టించాడు.



Scanned with CamScanner

సోమయ్య ఆస్తి అంతా అయిపోయింది. అతనికి నాలుగు దేశాలూ తిరిగి వింతలు చూచి, జ్ఞానం సంపాదించాలనిపించింది. అతడు ఒక మంచి ముహూర్తం చూచుకొని బయల్దేరాడు.

ఈ విషయం తెలిసిన ఆ వూరి ప్రజలు అందుకు ఒప్పుకోలేదు. తమ ఇండ్ల వద్ద వుండమన్నారు. సోమయ్యను వూరు విడిచి వెళ్ళవద్దని బతిమాలారు.

సోమయ్య వారిని ఒప్పించి నిర్ణయించుకున్న రోజు బంగారు పెట్టెతో సహా బయలుదేరాడు.

## 3

సోమయ్య దేశాటన చేస్తూ చాలా ప్రదేశాలు చూశాడు. అక్కడ ప్రజల కష్టాలు చూచి చాలా విచారించాడు. 'సాధ్యమైనంత వరకు కష్టాలలో వున్నవారిని ఆదుకుని సహాయం చేయాలి' అని నిర్ణయించు కున్నాడు సోమయ్య. మేలెరిగిన మనిషిని పిలిచి ఒక మంచి కుక్కను ఇమ్మని అడిగాడు.

ఆ కుక్క చిరుతపులి అంత ఎత్తు వుంది. గోధుమ రంగుతో క్రూరంగా వుంది.

సోమయ్య ధర్మాపురం అనే వూరు వెళ్ళి అక్కడ ప్రజలకు కలిగే నష్టాలు చూచి వారికి సహాయం చేయడానికి నిశ్చయించుకున్నాడు. ఆ వూరి ప్రజలకు దెయ్యాల భయం వుంది. చీకటి పడితే బయటకు వచ్చేవారు కాదు. దానితో దొంగతనాలు ఎక్కువయ్యాయి.

సోమయ్య ఆ వూరి పెద్దలను కలుసుకున్నాడు. "నేను ఈరాత్రికి మీ వూరిలో వుండి వూరు కాపలా కాస్తాను. నేను దొంగలను పట్టుకున్నట్లయితే సహాయం కోసం పిలుస్తాను. పిలిచినప్పుడు రమ్మని చాటింపు వేయండి" అని చెప్పాడు సోమయ్య.

ఆ మాటలు విని వారు ఎగతాళిగా నవ్వి "వూరిలో వున్న ప్రజలంతా భయపడిపోయి రాత్రి బయటకు రావడం మానుకున్నారు. మరి నువ్వు



Scanned with CamScanner

ఎలా ఒక్కడివి పని సాధించగలవు?" అన్నారు.

సోమయ్య "నేను ఒకసారి ప్రయత్నిస్తాను. అవకాశమివ్వండి" అన్నాడు.

ఆవూరి పెద్దలు మొదట నమ్మకపోయినా తరువాత అతని మాటలు నమ్మి చాటింపు వేయించారు.

ఆరాత్రి సోమయ్య ఒక లావుపాటి కర్ర తీసుకుని కుక్కతో సహా వూరంతా తిరిగాడు. దొంగలు వచ్చారు కాని సోమయ్య ధైర్యం చూసి, కుక్కను చూసి, దొంగతనం చేయకుండా పారిపోయారు.

తెల్లవారిన తరువాత సోమయ్య వూరి పెద్దలని సమావేశపరచి 'రాత్రి దొంగతనం జరిగిందా?' అని అడిగాడు. 'జరగలేదు' అన్నారు వాళ్ళు. సోమయ్య అప్పుడు ఇలా చెప్పాడు: "నేను రాత్రి వూరు కాపలా కాశాను. మీవూరిలో దెయ్యాలు వుంటే నాకు ఏమైనా హాని కలిగి వుండేది కదా. కాని ఆ విధంగా జరగలేదు. ప్రజలను భయపెట్టడానికే ఎవరో దెయ్యాలున్నాయి అంటున్నారు. మీరీ విధంగా భయపడటంవల్లనే దొంగతనాలు జరుగుతున్నాయి. పంటలు కోసుకుపోతున్నారు. మీరు భయపడవలసిన పని లేదు. నేను మరి కొన్ని రోజులు ఇక్కడే వుంటాను."

సోమయ్య కొన్నిరోజులు అక్కడేవుండి ప్రజలకు భయంపోయిన తరువాత మరో వూరు ప్రయాణమయ్యాడు. సోమయ్యను ఆ వూరిలో వుండి పొమ్మని అడిగారు ఆ ప్రజలు. కాని సోమయ్య వినక తన కుక్కను వారికిచ్చి "దొంగలను పట్టుకోవడానికి సహాయపడుతుంది" అని చెప్పి అక్కడ నుండి బయల్దేరాడు.

## 4

సోమయ్య అక్కడికి యాభై యోజనాల దూరంలో వున్న రాజధానికి వెడుతున్నాడు. మధ్యలో పెద్ద పెద్ద అడవులు దాటుతున్నాడు. అంత దూరం కాలినడకన వెళ్ళడం కష్టం కదా అని మేలెరిగిన మనిషిని పిలిచి

ఒక పంచకళ్యాణి గుర్రాన్ని, ఒక పదునైన కత్తిని కోరాడు. వెంటనే వాటిని ప్రసాదించి అదృశ్యమయ్యాడు మేలెరిగిన మనిషి.

సోమయ్య చాలా వూర్లు దాటుకుంటూ, అనేక అరణ్యాలు దాటుకుంటూ భయంకర జంతువులతో కూడిన దట్టమైన కీకారణ్యాన్ని చేరుకొన్నాడు. అతడి పైకి వచ్చిన అనేక జంతువులను చంపుకుంటూ ముందుకు దూసుకుపోయాడు.

అతడు ఒక మర్రి చెట్టు దగ్గర ఆగి దగ్గరలోనే గల కొలనులో నీరు త్రాగి, గుర్రంచే నీరు త్రాగించి, ఒక పచ్చిక బయలుపై గుర్రాన్ని వదిలి తాను చెట్టు క్రింద విశ్రమించాడు. ప్రయాణ బడలిక వలన మత్తుగా నిద్రపట్టింది.

కొంతసేపటికి "నాయకా! పులి వస్తున్నది. జాగ్రత్త!" అన్న మాటలు వినిపించాయి. అతడు వులిక్కిపడి లేచి చూసేసరికి ఎదురుగా గుర్రం నిలబడి వుంది. "నేనే ఇప్పుడు మాట్లాడింది" అని అంది గుర్రం. అతడికి అంతా అయోమయంగా వుంది. 'గుర్రం మనుష్య భాషలో మాట్లాడడం ఏమిటి'? అనుకున్నాడు. 'ఇది గొప్ప మహత్తుగల గుర్రం' అనుకున్నాడు.

ఇంతలోనే పులి వచ్చి సోమయ్యపై పడబోయింది. వెంటనే సోమయ్య పక్కకు తప్పుకున్నాడు. పులి క్రిందపడిపోయింది. సోమయ్య కత్తితో దాని కడుపులో పొడిచాడు. అది గట్టిగా అరుస్తూ మరణించింది.

సోమయ్య అచ్చట నుండి బయలుదేరి తన ప్రయాణం కొనసాగించాడు.

రాజధాని పట్టణాన్ని సోమయ్య చేరుకున్నాడు. పట్టణం లోపలకి అతడు ప్రవేశించబోతుండగా అతడిని ద్వారపాలకులు లోపలకి వెళ్ళనివ్వలేదు. దానితో అతడు కాపలాదారులకు తన గురించి ఎన్నో విధాల చెప్పి, వెళ్ళటానికి ప్రయత్నించాడు. కాని అతని ప్రయత్నం ఫలించలేదు. అతడు అక్కడ నుండి వెళ్ళి గుర్రాన్ని ఒక చెట్టుకు కట్టేసి మేలెరిగిన మనిషిని



Scanned with CamScanner



పిలిచి అదృశ్యరూపం వచ్చేటట్లు చెయ్యమన్నాడు. అతడు అలాగే చేశాడు. సోమయ్య హాయిగా లోపలికి వెళ్ళి వింతలు-విడ్డూరాలు చూస్తున్నాడు.

ఇంతలో ఒకచోట జనం సమూహంగా వుండటం కనిపించింది. అక్కడకు వెళ్ళి చూశాడు. అక్కడ ఒక ప్రకటన వుంది. అది మహారాజు సుశేనుడు చేసిన ప్రకటన. దానిలో ఇలా వుంది: 'ఇక్కడకు దగ్గరలో గల అరణ్యం నుండి భయంకరమైన అడవిపంది ఒకటి వచ్చి చుట్టు పక్కల వున్న గ్రామాల్లోని పంటలను నాశనం చేస్తోంది. కనబడిన మనుషులను చంపుతోంది. దానిని సజీవంగాగాని, చంపిగాని తీసుకొని వచ్చిన వారికి గొప్ప సత్కారం జరుగుతుంది' అని.

దానితో అతడికి ఎక్కడలేని వుత్సాహం వచ్చింది. రాజుగారిని కలుసుకోవాలనిపించింది. ఆరోజు రాజుగారి దర్బారు జరుగుతోంది. దర్బారులో తన అసలురూపంతో కూర్చున్నాడు సోమయ్య. సభానంతరం సోమయ్య రాజును కలుసుకున్నాడు. 'అడవిపందిని తప్పక పట్టితెస్తాను' అన్నాడు.

"నీకంటె వీరులైనవారు కూడా మరణించారు. అయినా నీకు ఒకసారి అవకాశమిస్తాను. నీతో భటుల్ని సహాయంగా పంపమంటావా?" అని రాజు సుశేనుడు అడిగాడు.

"నాకు ఎవ్వరూ సహాయంగా రానక్కరలేదు. నేను పట్టిన తరువాత వచ్చి చెబుతాను. అప్పుడు ఆ సైనికుల అవసరం వుంటుంది" అన్నాడు సోమయ్య. సోమయ్య రాజు వద్ద సెలవు పుచ్చుకొని బయలుదేరి గుర్రం దగ్గరకి వెళ్ళి, అక్కడ నుంచి తాను వెళ్ళవలసిన ప్రదేశానికి సన్నద్ధమయ్యాడు.

## 5

సోమయ్య ఒకరోజు ప్రయాణం చేసి రంగాపురం అనే వూరు చేరుకున్నాడు. అక్కడగల ప్రజలకు తను దేనికోసం వచ్చింది వివరించి, అడవిపంది ఎక్కడకు ప్రతిరోజు వస్తుందో తెలిసికొని, తాను చేయవలసిన పని ఆలోచించాడు.

అడవిపంది స్థావరానికి చేరుకున్నాడు. సజీవంగానే పట్టి తీసుకు రావడానికి అనువైన ప్రదేశం అది. చుట్టుప్రక్కల చెట్లు వున్నాయి. పొదల మధ్య దాని స్థావరం. దానిని బంధించడానికి తగిన వలలు పట్టుకొని చెట్టుపై కూర్చున్నాడు సోమయ్య. మత్తుమందు కలిపిన తినుబండారాలు వుంచాడు దాని స్థావరం దగ్గర. రెండవరోజు అడవిపంది అరుపు వినిపించింది. సోమయ్య చెట్టెక్కి వల పట్టుకుని కూర్చున్నాడు. అడవిపంది రానే వచ్చింది. అక్కడ తినుబండారాలు తింది. దాంతో దానికి మత్తువచ్చి అక్కడే పడుకొని గుర్రుపెట్టడం మొదలుపెట్టింది. సోమయ్య అదను చూచుకుని వల దానిమీదకు విసిరాడు. దానిని చెట్టుకి కట్టేసి పట్టణానికి వెళ్ళాడు. రాజును కలుసుకొని భటుల ద్వారా సజీవంగానే అడవిపందిని తెప్పించాడు.



సోమయ్యను ఘనంగా సత్కరించారు. అక్కడ నుంచి మరొక వూరు ప్రయాణమవ బోయాడు అతడు. కొన్ని నెలలైనా తమ ఆస్థానంలో వుండమని రాజు కోరడంతో అతడు అక్కడే వున్నాడు.

రోజులు గడుస్తున్నాయి. రోజురోజుకి సోమయ్యపై రాజుకి అభిమానం పెరగసాగింది. సోమయ్య రాజుకు రాజ్యపాలన విషయంలో గొప్పగొప్ప సలహాలిచ్చేవాడు.



Scanned with CamScanner

సోమయ్యపై రాజుకుగల అభిమానానికి మంత్రి విద్యాధరుడికి కన్నుకుట్టింది. సోమయ్యను ఎలాగైనా చంపితేగాని తనకు పీడ విరగడ అవదని అనుకున్నాడు. మంత్రి ఒక పథకం వేసి ఆ పథకం ప్రకారం సోమయ్యను వలలో వేసికొని చంపాలనుకున్నాడు.

విద్యాధరుడి కుమార్తె సరోజ. ఆమె అందమైనదే కాని తండ్రివలె కుటిలబుద్ధి కలది. ఆమె తండ్రి పథకానికి ఒప్పుకున్నది. విద్యాధరుడి పథకం ప్రకారం సోమయ్యను తమ ఇంటికి ఒకరోజున విందుకు ఆహ్వానించాలి. సరోజ అతడితో మంచిమాటలు చెబుతూ అతడిచే విషం కలిపిన పాలు త్రాగించాలి. ఇదీ వారి పథకం.

మరునటిరోజు విద్యాధరుడు సోమయ్యను కలుసుకుని "మహామంత్రీ! మీరు ఈరోజు మాఇంటికి విందుకురావాలి" అన్నాడు.

"ఇదేమిటండీ, నేను మహామంత్రినా!" అన్నాడు సోమయ్య.

"రాజుగారికి గొప్పగొప్ప సలహాలిస్తూ మంత్రి కంటే గొప్పవాడని పించుకున్న మిమ్మల్ని ఏమని సంభోదించాలో తెలియక అలా పిలిచాను" అన్నాడు విద్యాధరుడు.

సోమయ్య 'అలాగే వస్తాను' అన్నాడు. సోమయ్య మేలెరిగిన మనిషిని





Scanned with CamScanner

పిలిచి సలహా అడిగాడు. 'అక్కడ విషప్రయోగం జరుగుతుంది. ఏమీ తినడం గాని, త్రాగటం కాని చేయొద్దు' అని అతడు సలహా ఇచ్చాడు.

సోమయ్య విందుకు హాజరయ్యాడు. ఏవేవో పదార్థాలు అతడి ముందు పెట్టి వాటిని తినాలని వారు కోరారు. "నాకు వంట్లో ఏమీ బాగోలేదు, కొద్దిగా పాలు ఇయ్యండి" అన్నాడు. సరోజ వెంటనే లోపలికి వెళ్ళి పాలు తెచ్చింది. ఇంతలో ఒక పిల్లి అటే వచ్చింది. సోమయ్య వెంటనే దాని ముందు పాలుపోశాడు. అది ఆ పాలు త్రాగి విలవిల కొట్టుకొని చచ్చిపోయింది.

సోమయ్య విద్యాధరుడితో "నీవు మహామంత్రివి కాబట్టి నేను వూరుకుంటున్నాను. కాని ఈపనే ఇంకొకరు చేస్తే చంపి వెళ్ళేవాడిని" అని చెప్పి అక్కడ నుంచి కోటకు వెళ్ళిపోయాడు.

## 6

రాజు సుశేనుడికి పిల్లలు లేరు. భార్య పద్మావతి చాలా మంచిది. ఆమె ఎన్నో వ్రతాలు చేసినా పిల్లలు పుట్టలేదు.

మంత్రి విద్యాధరుడికి రాజ్యం చేజిక్కించు కోవాలన్నదే ఆలోచన. రాజు ఒకవేళ సోమయ్యకు పట్టాభిషేకం చేస్తే తను అనుకున్నట్లుగా ఆ రాజ్యం తన చేతికిరాదు. తాను సోమయ్యను చంపాలని చేసిన పని నెరవేరలేదు. ఆయన మరొక ఆలోచన చేశాడు. ఆ ప్రక్క రాజ్యానికి రాజైన మహేంద్రుడిని రహస్యంగా కలుసుకొని సుశేనుడి రాజ్యంపై దండెత్తమని, అతడు నెగ్గేందుకు తాను చేయవలసినదంతా చేస్తానని, రాజ్యాన్ని యిద్దరూ చెరిసగం పంచుకోవచ్చునని అతడితో చెప్పాడు. మహేంద్రుడు అందుకు అంగీకరించాడు.

సుశేనుడిపై మహేంద్రుడు దండెత్తి వస్తున్నట్లు కబురు వచ్చింది. రాజుకి ఈ వార్త ఎంతో ఆందోళనని కలిగించింది. మంత్రి ఆయనకు ధైర్యం చెబుతూ "ఇందులో భయపడవలసినది ఏమీలేదు. మనం మహేంద్రుడిపై సులువుగా విజయం సాధించగలం" అన్నాడు. మంత్రి

ఇచ్చిన ధైర్యంతో రాజు భయం తగ్గింది.

ఎందుకైనా మంచిదని రాజు సోమయ్యకు కూడా ఈ విషయం చెప్పాడు. సోమయ్య కొంతమంది మంచియోధులతో తాను యుద్ధంలో పాల్గొనేందుకు సిద్ధమయ్యాడు.

మంత్రి విద్యాధరుడు సైన్యాధిపతికి తన పథకం వివరించి అతడి సహాయం కోరాడు. సైన్యాధిపతి 'అలాగే' అని అతడితో చెప్పి, ఆ విషయం రాజుతో చెప్పాడు. రాజు వెంటనే మంత్రిని బంధించి, సోమయ్యను సర్వసైన్యాధ్యక్షుడిని చేశాడు.

అనుకొన్న గడువుకి రెండుసైన్యాలమధ్య యుద్ధం ప్రారంభమయింది. యుద్ధం భీకరంగా జరిగింది. సోమయ్య తన పథకం ప్రకారం శత్రుసైన్యాన్ని చుట్టుముట్టి వారిని తుదముట్టించి వీర విహారం చేశాడు. ఆఖరికి మహేంద్రుడు లొంగిపోక తప్పలేదు. మంత్రి ప్రోత్సాహంతో తానీపని చేశానని క్షమాభిక్ష పెట్టమని అతడు రాజును, సోమయ్యను వేడుకొన్నాడు.

మహేంద్రుడిని క్షమించి విడిచిపెట్టారు. మంత్రిని ఉరి తీశారు. రాజు సోమయ్యను కౌగిలించుకుని అతడిని అనేక విధాల పొగిడాడు. తన తర్వాత రాజుగా అతడికే పట్టం కడతానన్నాడు. కాని సోమయ్య దానికి ఒప్పుకోలేదు. ఎక్కడికీ వెళ్ళకుండా తన వద్దనే వుండమని రాజు సోమయ్యను మరీ మరీ బలవంతం చేయడంతో సోమయ్య మరి కొంతకాలం అక్కడే వుండాలని నిశ్చయించుకున్నాడు.

## 7

కుంతల దేశాన్ని రవివర్మ పరిపాలిస్తున్న రోజులవి. అతడు చాలా మంచివాడు. ప్రజలకు ఎన్నో సౌకర్యాలు చేకూరుస్తూ అందరి మెప్పు పొందాడు. రవివర్మ కుమార్తె విజయలక్ష్మి అందచందాలకు పెట్టింది పేరు. చాలామంది రాజకుమారులు ఆమెను వివాహమాడ వచ్చారు. కాని రవివర్మ వారిని కాదని, ఒక క్రొత్త పద్ధతిలో తన అల్లుడిని ఎన్నుకోవాలని నిశ్చయించుకున్నాడు. తాను కోరిన మూడు కోర్కెలు తీర్చిన వాడికే తన



Scanned with CamScanner

కూతురునిచ్చి వివాహం చేస్తానని చాటించాడు. అతడి చాటింపు తెలుసుకుని చాలామంది రాజకుమారులు వచ్చారు గాని అతడి కోర్కెలు విని అందరూ 'మావల్ల సాధ్యంకాదు' అంటూ వెనుతిరిగిపోయారు.

ఈవార్త సుశేనుడికి అందింది. సుశేనుడు సోమయ్యను బయలు దేరమన్నాడు. సోమయ్య ప్రయాణమయ్యాడు.

రవివర్మ సోమయ్యకు రాజలాంఛనాలతో అతిథిమర్యాదలు చేశాడు. రవివర్మ తన కూతురుకు కాబోయేవరుడు తీర్చవలసిన కోర్కెలను వివరించాడు.

"మొదటిది, పంచభక్ష్య పరమాన్నాలు ఇచ్చే బంగారు పళ్ళాన్ని తీసుకురావాలి.

రెండవది, వారం రోజులు దేశమంతటా వాన కురిపించాలి.

మూడవది, ఈ పరీక్షలో పాల్గొనే వ్యక్తి తనకు అతి ప్రియమైన వారిని కత్తితో నరికేయాలి" అన్నాడు. సోమయ్య అన్నింటికీ ఒప్పుకొన్నాడు.

సోమయ్య తన గదికి వెళ్ళి, బంగారు పెట్టె తీసి 'మేలెరిగిన మనిషి'ని పిలిచి రాజు తెలిపిన కోర్కెలన్నీ చెప్పాడు.





Scanned with CamScanner

'మేలెరిగిన మనిషి' సంతోషంతో మూడు కోర్కెలు తీరుస్తానన్నాడు. బంగారు పళ్ళెం ఇచ్చి, సాయంత్రం నుంచి వాన కురిపిస్తానన్నాడు.

సోమయ్య పళ్ళెంతో రాజు వద్దకు వెళ్ళి దానిని రాజుకు చూపించాడు. రాజు దానిని పరీక్షించాడు. 'ఇతడు ఘటికుడే' అనుకున్నాడు. సాయంత్రం నుంచి వాన కురుస్తుందని సోమయ్య రాజుకు చెప్పాడు.

ఆ సాయంత్రమే వాన ప్రారంభమయింది. ఉరుములతో, జల్లులతో ఏకధాటిగా వాన కురిసింది. ఆ వర్షాన్ని భరించలేక మూడవరోజుకు ఆపు చేయమని రాజు సోమయ్యను వేడుకున్నాడు.

సోమయ్య మేలెరిగిన మనిషితో సహా రాజు వద్దకు వెళ్ళాడు. సోమయ్య రాజుతో "ఇతను నాకు ప్రియమైన వ్యక్తి. నాకోసం మరణిస్తాడు" అంటూ మేలెరిగిన మనిషిని చూపించాడు. రాజు సోమయ్య చేతికి ఒక పదునైన కత్తిని ఇచ్చి, అతడి తల నరికివేయమన్నాడు.

మేలెరిగిన మనిషి తన మెడ వంచి నించోగా, సోమయ్య రాజు ఇచ్చిన కత్తితో చివాలున అతడి మెడ నరికేశాడు. కాని అతడి తల క్రింద పడేలోగానే ఆ దేహం మాయమయి, మరో కొత్త వ్యక్తి ప్రత్యక్షమయ్యాడు. అతడు మహావీరుడిలా వున్నాడు. అతడి ముఖంలో గొప్ప వర్చస్సు కనిపిస్తోంది. అతడి చేతిలో తళతళ మెరుస్తున్న బంగారు కత్తి వుంది. అతడు "నేను యక్షుడిని. ఒక ఋషి నావద్దకు వచ్చి యజ్ఞం కోసం సహాయం కోరాడు. దానిని నేను నిరాకరించాను. అతడు మండిపడి 'పుణ్యాత్ములకు సహాయం చేయడంలోని గొప్పతనం నీకు తెలియదు. ఒక మాయ బంగారుపళ్ళెం వెనుక నీ రూపం మరుగునపడి, దాని యజమానికి సేవచేస్తూ గడుపుదువు గాక' అని శపించాడు. శాప విముక్తి చేయమని వేడుకోగా 'ఆ బంగారుపళ్ళెం యజమాని గొప్ప వీరుడుగా పేరు తెచ్చుకున్నాక, అతడి చేత నీ తల నరకబడి నీకు శాపవిమోచనం జరుగుతుంది' అని తనగురించి యక్షుడు వారితో చెప్పాడు. తరువాత సోమయ్యతో "రాజువై చిరకాలం పరిపాలించి ప్రజలకు ఆనందాన్ని



కలిగించు" అని చెప్పి అదృశ్యమయ్యాడు.


విజయలక్ష్మితో సోమయ్యకు అతిలోక వైభవంగా వివాహం జరిపించాడు రవివర్మ. సుశేనుడు, రవివర్మ తమ రాజ్యాలకు సోమయ్యను రాజుగా ప్రకటించారు. సోమయ్య సోమనాథ మహారాజు అయ్యాడు.

(బాలజ్యోతి, ఫిబ్రవరి 1981)



Scanned with CamScanner

# ఎన్నిక



కవులపల్లి అనే గ్రామం సింహపురి రాజ్యంలో ఉంది. ఆ గ్రామాధికారి కనకయ్య హఠాత్తుగా మరణించాడు. దాంతో గ్రామంలో పాలకుడు లేక తగాదాలు చెలరేగాయి.

పన్నులు వసూలు కాకపోవడంతో కవులపల్లి గ్రామం విషయం రాజుగారి దృష్టిలోకి వచ్చింది.

రాజు సింహకేతు మంత్రి మాధవయ్యను పిలిచి 'వెంటనే కవులపల్లి గ్రామానికి పాలకుడిని ఎన్నిక చేయండి' అని ఆజ్ఞ జారీచేశాడు.

కవులపల్లి గ్రామంలో ఈ విషయమై దండోరా వేయడం జరిగింది. ''గ్రామాధికారి పదవి పట్ల ఆసక్తి ఉన్న వారందరూ మంత్రి మాధవయ్యగారిని ఫలానా దశమి రోజున ఇక్కడకు వచ్చినప్పుడు కలవండహో!''

మంత్రి మాధవయ్యగారు అనుకున్నరోజున ఆ గ్రామానికి వచ్చి విడిదిలో బస చేశారు. అతన్ని సుమారు వందమంది పౌరులు కలిసి గ్రామాధికారి పదవికి అర్హత, ఆసక్తి ఉన్నాయని చెప్పుకున్నారు.

వారి విద్యార్హతలు, అలవాట్లను బట్టి కొంతమందిని తప్పించారు.



Scanned with CamScanner

ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మరికొందరిని తప్పించారు. ఇలా చాలా రకాల పరీక్షలు నిర్వహించగా చివరకు వీరయ్య, మల్లయ్య అనే ఇద్దరు అన్ని పరీక్షలలో నెగ్గి నిలిచారు.

వారిని మరునాడు కలుసుకోమని చెప్పి పంపించాడు మంత్రి మాధవయ్య!

మరునాడు వారు రాగానే "మీరు ఈ గ్రామస్థులే కదా! మీరు మీ గ్రామం మొత్తం ఒకసారి తిరిగి రండి. మీరు మార్గమధ్యంలో ఎవరితో మాట్లాడరాదు. నవ్వరాదు. పదవిలో ఉండగోరే వారికి కొన్ని లక్షణాలుండాలి. వాటి నిమిత్తం ఈ పరీక్ష! మీ యిద్దరినీ అనుసరిస్తూ యిద్దరు సిపాయిలు ఉంటారు. ఇదే చివరి పరీక్ష" అని చెప్పారు.

వీరయ్య వెంటనే గ్రామంలోకి నడిచాడు. అతడు మంత్రిగారు చెప్పింది అక్షరాలా పాటించాడు. తనని ఎంతోమంది పలకరించినా జవాబివ్వలేదు. కనీసం నవ్వలేదు. ఆఖరుకు బంధువులు పిలిచినా అటువైపు చూడలేదు.

మల్లయ్య మాత్రం మంత్రిగారి నిబంధన గుర్తులేనట్లే ఎప్పటిలాగే ప్రవర్తించాడు. అతను ఎందరినో కలుసుకున్నాడు. చాలామంది సమస్యలకు పరిష్కారం చూపాడు. మిగతావారితో ఎంతో కలుపుగోలుగా అభిమానంగా మాట్లాడి తిరిగి వచ్చాడు.

మాధవయ్య సిపాయి లిరువురిని రప్పించి "మీరిద్దరూ వీరయ్య, మల్లయ్యలను అనుసరించారు కదా! వారు ఎలా ప్రవర్తించారో చెప్పండి" అని అడిగాడు.

మొదటి సిపాయి "నేను వీరయ్యగారిని అనుసరించాను. మీరు విధించిన నిబంధన తు.చ. తప్పకుండా పాటించాడు" అని చెప్పాడు.

రెండవ సిపాయి "నేను మల్లయ్యగారిని అనుసరించాను. అతడు మీ పరీక్షలో ఓడిపోయినట్లు భావిస్తున్నాను. అతడు మీ నిబంధన

ఉల్లంఘించి అందరితో నవ్వుతూ పలకరించి మాట్లాడి ఎందరికో సమస్యలు తీర్చాడు. మీరు పెట్టిన పరీక్షలో పాల్గొన్నట్లుగాక మామూలు మల్లయ్యలా ప్రవర్తించాడు" అని చెప్పాడు.

వారి మాటలు విని మరునాడు గ్రామాధికారి ఎన్నిక జరుగుతుందని ప్రకటించాడు మాధవయ్య.

సిపాయిలు మాత్రం "మరునాటి వరకు వాయిదా అనవసరం! స్పష్టంగా వీరయ్య గెలిచినట్లు తెలిసిపోయింది కదా" అనుకున్నారు.

మరునాడు గ్రామస్తులందరూ పాల్గొన్న సభలో మంత్రి తన నిర్ణయం ప్రకటించి అందరినీ ఆశ్చర్యపడేలా చేశాడు. ఆ ప్రకటన సారాంశం- "మల్లయ్య నూతన గ్రామాధికారిగా పదవీబాధ్యతలు స్వీకరిస్తాడని!"

సిపాయిలు ఆశ్చర్యపోయి మంత్రివైపు చూస్తుంటే అప్పుడు మాధవయ్య ఇలా చెప్పాడు. "దారిలో మాట్లాడరాదు-అన్న నిబంధన కేవలం వారి వ్యక్తిత్వాన్ని పరీక్షించడానికి పెట్టింది. అది ఖచ్చితంగా అమలుపరిచాడు వీరయ్య. అంటే పదవి వస్తుందంటే దేనికైనా సిద్ధపడతాడని అర్థమైపోతుంది కదా! అలాంటి వ్యక్తికి పదవి ఇవ్వకూడదు".


"మరి మల్లయ్య విషయానికి వస్తే ఎప్పటిలాగే ప్రజలతో ప్రవర్తించి, నా నిబంధన గుర్తులేనట్లే నటించి తన వ్యక్తిత్వం నిలుపు కున్నాడు. 'పదవి రాకపోయినా ఫర్వాలేదు. ప్రజలతో సత్సంబంధాలు కావాలి' అనుకునే మల్లయ్య వంటి పాలకులు మన రాజ్యానికెంతో అవసరం. అందుకే అతనినే ఈ పదవికి ఎన్నిక చేస్తున్నాను" అని ముగించేసరికి గ్రామస్తులంతా ఆమోదం తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

సిపాయిల సందేహం కూడా తీరిపోయి తృప్తిగా మంత్రి నిర్ణయానికి ఆమోదం తెలిపారు..

(ఆంధ్రప్రభ వారపత్రిక)



Scanned with CamScanner



# చిక్కుప్రశ్నలు

సింహపురి రాజ్యాన్ని సింహపాలుడు అనే రాజు పరిపాలించేవాడు. అతడు చాల మంచివాడు. ప్రజలను కన్నబిడ్డలవలె పరిపాలించి అందరి మెప్పు పొందాడు. అయితే అతనికి పెండ్లి జరిగిన చాలా కాలం వరకు సంతానం కలగలేదు. ఎందరో దేవుళ్ళకి మొక్కినప్పటికీ, ఎన్నో నోములు, వ్రతాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరికి ఒకముని ఆశీస్సుల వల్ల మహారాణి పండంటి మగబిడ్డని ప్రసవించింది. సింహపాలుడి సంతోషానికి అంతులేకపోయింది. రాజ్యప్రజలందరూ పండుగ జరుపుకున్నారు. తమ రాజుగారికి కాబోయే వారసుడు జన్మించాడని సంబరపడ్డారు.

ఆనందకర వాతావరణంలో రాజ్యప్రజలున్నారు. రాజు సింహపాలుడు సభ జరుపుతుండగా పొరుగు రాజ్యం నుండి జ్ఞానశిఖి అనే పండితుడు వచ్చి రాజు సింహపాలుడిని కలిసి "రాజా నేను రెండు చిక్కు ప్రశ్నలు అడుగుతాను. మీరు కానీ పండితులుకానీ, సభికులుకానీ ఎవరయినా సరే జవాబు చెప్పవచ్చు. మీరు గెలిస్తే నేను ఆ చెప్పిన వ్యక్తికి బానిసనౌతాను. ఒకవేళ మీరు ఓడిపోతే ఎంత మందయితే సమాధానం చెప్పేందుకు ప్రయత్నించి ఓడిపోతారో అంతమందీ నాకు బానిసలయి జీవితాంతం సేవచేయాలి" అన్నాడు గర్వంగా.

రాజు తన పండితులతో కలిసి ఆలోచించి 'సరే'నన్నాడు.

ఆ పండితుడు జ్ఞానశిఖి "రాజా అద్భుత శక్తులు లేకుండానే ఒకటిని రెండుగా చూపగలిగేది ఏది? ప్రాణం లేకపోయినా కాలు వేస్తే కరచేది ఏది?" అని ప్రశ్నించాడు.

పండితులంతా ఆలోచనలో పడ్డారు. అంతలో ఓ పశువుల కాపరి సభలో ప్రవేశం కోరుతూ వచ్చి ఆ ప్రశ్నలు మళ్ళీ చెప్పమని కోరాడు. జ్ఞానశిఖి ఆ ప్రశ్నలు చెప్పాడు.

అప్పుడా పశువుల కాపరి రాజు అనుమతి పొంది జవాబులు చెప్పాడు. "అయ్యా పండితుడుగారూ! మీరు వేసిన మొదటి ప్రశ్నకు జవాబు అద్దం. అది ఒక వస్తువును రెండుగా చూపగలదు కదా! ఇక రెండవదానికి జవాబు 'చెప్పు'. మనుషులు కొత్త చెప్పు తొడిగితే కరుస్తుంది కదా. దానికి ప్రాణం లేదుకదా" అన్నాడు.

అంతే! సభ చప్పట్లతో మారుమ్రోగిపోయింది. జ్ఞానశిఖి తన ఓటమిని అంగీకరించాడు.

అప్పుడు రాజు సింహపాలుడు ఆ పండితుడిని మందలిస్తూ "మీరు వేసే చిక్కుప్రశ్నలు ఎంతో కఠినమైనవై ఉండొచ్చని అనుకున్నాం. మాదేశంలో గల పశువుల కాపరి చెప్పగలిగేంత సులభమైనవా! వీటికోసం జీవితకాలం బానిసవు అవుతావా? పోటీలు మాని ఎక్కడయినా కవిత్వం చెప్పుకొని బ్రతుకు" అన్నాడు.


ఇంతకీ ఆ జవాబులు చెప్పింది నిజమైన కాపరికాదు. ఆస్థాన పండితుడు జ్ఞానమిత్రుడు. ఆరూపంలో వచ్చి జవాబులు చెప్పి జ్ఞానశిఖికి గర్వభంగం చేశాడు.

(మయూరి వారపత్రిక)



Scanned with CamScanner

# అల్పబుద్ధి



రాము, సోము ఏడవతరగతి చదువుతున్నారు. వారిద్దరూ ప్రతిరోజు నాలుగుమైళ్ళ దూరంగా ఉన్న సీతానగరం స్కూలుకి వెళుతుంటారు. రాము బస్సులో వెళ్ళేవాడు. సోము సైకిలుపై వెళ్తుంటాడు. ఇద్దరూ తెలివైనవాళ్ళే.

వారికి సంవత్సరాంతపు పరీక్షలు జరుగుతున్నాయి.

సైన్సుపరీక్ష జరుగుతున్నరోజున సోముపెన్సిలుని ఎవరో దొంగిలించారు. పరీక్షలో బొమ్మ గీయవలసిన అవసరం ఉంది. బొమ్మ గీయకపోతే మార్కులు తగ్గిపోతాయి. అందుకని రాముని పిలిచి పెన్సిల్ ఇమ్మని అడిగాడు సోము.

రాముకి దుర్బుద్ధి పుట్టింది. సోముకీ తనకీ సరిసమానంగా మార్కులు వస్తున్నాయి. తను పెన్సిల్ ఇవ్వకపోతే ఆ బొమ్మ గీయకపోతే సోముకి కొన్ని మార్కులు తగ్గిపోతాయి. ఇలా అనుకొని, "ఇదిగో, ఇస్తాను. ఒక్కక్షణం ఆగు" అంటూ ఆఖరి వరకు గడిపేశాడు గాని పెన్సిల్ ఇవ్వలేదు. రాము ఇస్తాడన్న ధీమాతో మరెవరినీ అడగలేదు సోము. అలా ఆరోజు అతడు బొమ్మ గీయలేకపోయాడు. రాము అందుకు ఎంతో సంతోషించాడు. మరునాడు సోషల్‌స్టడీస్ పరీక్ష ఉంది. సైకిలు మీద వస్తున్న సోముకి రిపేర్‌లో ఉన్న బస్సు కన్పించింది.



Scanned with CamScanner

అదిచూచి అక్కడ ఆగాడు. అక్కడ నిలబడ్డవారిని చూచి "ఏమయింది? బస్సు ఎందుకు ఆగిపోయింది" అని వాకబు చేశాడు.


దానికి అక్కడ ఉన్న ప్రయాణీకులు "బస్సు రిపేరులో ఉంది బాబూ! ఎప్పటికీ బాగవుతుందో చెప్పలేము అంటున్నారు" అని జవాబిచ్చారు. వారిలో రాముకూడా ఉన్నాడు.

రాము సోముని సహాయం అడగడానికి మొహమాటపడ్డాడు. అతడికి అంతకు ముందురోజు తను చేసిన దగా గుర్తొచ్చింది. అయినా సరే పరీక్ష ముఖ్యం కనుక ఎలాగోలా సోముని పిలిచి "సోమూ! ఈ బస్సు బాగు అయ్యేలా అన్పించడం లేదు. నేను నడిచివస్తే పరీక్షకు అందేలా లేను. నిన్నటి విషయాన్ని మనసులో పెట్టుకోకుండా నన్ను నీ సైకిల్ మీద స్కూల్ వరకు తీసుకువెళతావా? అని అడిగాడు సిగ్గుపడుతూ.

దానికి సోము నవ్వుతూ "భలేవాడివిరా నువ్వు. నిన్నటి విషయం నేను అప్పుడే మరచిపోయాను. నిన్ను తప్పకుండా తీసుకెళతాను రా! వచ్చి సైకిలు వెనుక కూర్చో! కలసి వెళదాం. లేకపోతే పరీక్షకు అందుకోలేవు" అని అతనిని సైకిల్ ఎక్కించుకున్నాడు.

సోముకి పెన్సిల్ ఇవ్వలేదన్న కోపంతో తనని తీసుకెళ్ళడేమో అనుకున్నాడు రాము. అతడికి కొన్ని మార్కులు తగ్గిపోతాయని పెన్సిల్ ఇవ్వలేదు తను. తను పరీక్షే తప్పిపోయే అవకాశం వున్నా అందుకు సిద్ధపడలేదు సోము. తన దుర్బుద్ధిని తిట్టుకుంటూ సోము మంచి మనసుకి జోహారులర్పించాడు రాము. ఆ తరువాత అల్పబుద్ధితో ఎప్పుడూ ఆలోచించలేదు.

(బాలరంజని, జనవరి 1987)



# దురాశ

రామనాథపురంలో రంగయ్య, వెంగయ్య అనే వ్యవసాయ దారులు ఉండేవారు. వారిది ఇరుగుపొరుగు నివాసం. రంగయ్య చాలా మంచివాడు. తన మానాన తను జీవించడం తప్ప ఎవరి జోలికి వెళ్ళేవాడు కాదు. వెంగయ్య దురాశపరుడు! ఎవర్ని మోసం చేద్దామా? ఎలా డబ్బు గడిద్దామా? అని ఆలోచిస్తుండేవాడు.

ఒకసారి వెంగయ్య రంగయ్య ఇంటివైపు చూస్తుండగా పెద్ద పాత్ర నిండా పాలతో వస్తున్న రంగయ్య కన్పించాడు. దాంతో వెంగయ్యలో దురాశ పుట్టింది. తనవద్ద ఓ గేదెఉంది. అది తక్కువ పాలు మాత్రమే ఇస్తుంది. దానిని మెల్లగా రంగయ్యకు అప్పగించి అతనివద్దనున్న పాడిగేదెను తీసుకోవాలనుకున్నాడు.



Scanned with CamScanner

మరునాడు చాలా తియ్యగా మాట్లాడుతూ రంగయ్య ఇంటికి వెళ్ళాడు వెంగయ్య! చాలాసేపు మాట్లాడిన తర్వాత అసలు విషయం బయటపెట్టాడు. "మనిద్దరం మనగేదెలు మార్చుకుందాం! నేను ముందుగా కొంత డబ్బు ఇచ్చి నీ గేదెను తీసుకుంటాను" అన్నాడు వెంగయ్య! రంగయ్య 'సరే' ననడంతో ఆరోజే డబ్బిచ్చి గేదెను తోలి ఆ గేదెను తనదొడ్లో కట్టుకున్నాడు వెంగయ్య!


మరునాడు ఎక్కువ పాలు ఇస్తుందన్న ఆశతో పెద్ద పాత్ర తీసుకుని వెళ్ళిన వెంగయ్యకు తన గేదెకంటె తక్కువ పాలు ఇచ్చింది ఆ గేదె! ఆశ్యర్యపోయాడతడు.

వెంటనే రంగయ్యను కలసి 'ఇందులో ఏదైనా తిరకాసుందా? నీవు తీస్తే ఎక్కువ పాలిచ్చే గేదె ఈరోజు తక్కువిస్తుందేం? అని అడిగాడు. దానికి రంగయ్య నవ్వుతూ "అదేం లేదు! ఎప్పుడూ ఒకేలా ఇస్తుంది. కాకపోతే నాకు పాలవ్యాపారం ఉంది కదా! పాలుతీసి ఇంట్లోకి తీసుకెళ్ళి నీరు కలపడం ఎవరైనా చూస్తే బాగుండదని ముందుగానే పాత్రను సగం వరకు నీరుతో నింపి ఆ తర్వాత అందులో పాలు తీస్తాను. అందుకే ఎక్కువగా కనబడి ఉంటాయి" అని జవాబిచ్చాడు.

తను సులభంగా మోసపోయానని ఎంతో విచారించాడు వెంగయ్య! తన దురాశే దీనికి కారణమని తెలుసుకుని తర్వాత జాగ్రత్త పడ్డాడు వెంగయ్య.

(స్వాతిసపరివార పత్రిక, 24-4-1987)

# చిలుక సమాధానం



పార్వతీపురం గ్రామంలో పరమానందం అనే వ్యక్తి ఉండేవాడు. అతడు చిలుక నొకదానిని పెంచుతుండేవాడు. దానికి మాటలు నేర్పాలని ప్రయత్నం చేసి చివరికి 'అందుకు సందేహమెందుకు?' అన్న మాట మాత్రం నేర్పాడు. దాంతో ఆచిలుక ఎవరేం మాట్లాడినా, 'అందుకు సందేహమెందుకు?" అని సమాధానమిచ్చేది.

ఒకసారి పరమానందంకు సొమ్ము అవసరం వచ్చింది. అతనికి డబ్బు లభించే మార్గం ఏదీ కనిపించలేదు. అప్పుడతని భార్య 'మనింట్లో ఉన్న చిలుకను అమ్మితే డబ్బు వస్తుంది. ఎలాగూ చిలుకకు మాటలు వచ్చు కనుక ఎవరైనా ఇట్టే కొనేస్తారు' అని సలహా యిచ్చింది.

పరమానందంకి ఆ సలహా బాగా నచ్చింది. భార్యను మెచ్చుకొని చిలుకతో సహా పట్నానికి బయలుదేరాడు-చిలుకను అమ్మడం కోసం.

పట్నంలో చిలుకను పట్టుకొని తిరుగుతూ ' మాట్లాడే చిలుకను అమ్ముతాం-కొనేవారుంటే రండి' అని కేక వేయసాగాడు పరమానందం.

చిలుకను చూసి దగ్గరికి చేరారు చాలామంది వ్యక్తులు.

"ఏం బాబూ ఎంతకు అమ్ముతావు?" అని ప్రశ్నించాడు వారిలో

ఒకడు.

"చిలుక ఖరీదు అయిదు వందలు. అందుకు తగ్గితే అమ్మేది లేదు" అని ఖచ్చితంగా చెప్పాడు పరమానందం.

"అయిదు వందలా? అంత ధర అయితే మాకు అక్కరలేదు" అనేసి వెళ్ళిపోయారు చాలామంది.

చివరకు ప్రముఖ వర్తకులున్న వీధిలో చిలుకను పట్టుకొని కేకవేస్తూ వెళ్ళసాగాడు పరమానందం. అతనిని పిలిపించాడు ఒక వ్యాపారి. ఆ చిలుకను ఎంతకు అమ్మదలిచావని ప్రశ్నించాడు.

పరమానందం దానిని అయిదు వందలకు అమ్మదలిచినట్లు చెప్పాడు. ఆ వ్యాపారి ఆశ్చర్యపోయి 'అంత ధర చెల్లించి కొనడానికి దానికి ఉన్న ప్రత్యేకత ఏమిటి?" అని అడిగాడు.

దానికి పరమానందం ' ఆ విషయం చిలుకను అడిగి చూడండి' అన్నాడు.

ఆవ్యాపారి చిలుక వైపు తిరిగి 'ఏం చిలకా! నీధర అయిదు వందలు చేస్తుందా?" అని ప్రశ్నించాడు.

"అందుకు సందేహమెందుకు?" అని సమాధాన మిచ్చింది చిలుక. దాంతో ఆ వ్యాపారి సంతృప్తి చెంది చిలుకను స్వంతం చేసుకున్నాడు.

మరునాడు చిలుకతో కాసేపు ముచ్చటించదలచాడు ఆ వ్యాపారి. అతడు చిలుకను మాటల్లోకి దించాలని ప్రయత్నించాడు. పాపం ఆ వ్యాపారి ప్రయత్నం వ్యర్థమైంది. అసలు ఆ చిలుకకు వేరే మాటలు వస్తే గదా!

ఆ వ్యాపారికి విసుగూ, కోపమూ వచ్చి, 'మాటలు రాని మామూలు పక్షిని తెచ్చి అద్భుతమైందని పొగిడిన వాడిని నమ్మి దీన్నికొన్నాను. నా అంత వెర్రివాడు ఈలోకంలో ఉండడు గాబోలు' అన్నాడు గట్టిగా!

అది విన్న చిలుక 'అందుకు సందేహమెందుకు?' అంది యథాప్రకారమే!

(ఉదయం వార పత్రిక, 20-4-1990)



Scanned with CamScanner

# తెలివైనకోరిక



విక్రమపురిరాజు వీరనాథుడు ఒకసారి అడవిమార్గం గుండా ప్రయాణిస్తుండగా హఠాత్తుగా దాడిచేసి మీద పడిందో చిరుతపులి. వీరనాథుడు దానిముందు ప్రాణం వదలాల్సిందే! కానీ ఎక్కణ్ణుంచి వచ్చారో కానీ నలుగురు గ్రామస్థులు వచ్చి దాన్ని తరిమి రాజుగారి ప్రాణం కాపాడారు.

వీరనాథుడు వారివైపు కృతజ్ఞతగా చూశాడు. తనప్రాణం కాపాడినందుకు ప్రతిఫలంగా కాకపోయినా బహుమతిగా వారి కోర్కెలేవైనా ఉంటే తీర్చదలచినట్లు చెప్పాడు. మరునాడు రాజభవనానికి రమ్మని చెప్పాడు. వారు 'అలాగే' అని వెళ్ళిపోయారు.

మరునాడు రాజుగారిని కలిశారు. "మీ కోర్కెలు చెప్పండి. అవి ఎలాంటివైనా తీరుస్తాను" అని మాట ఇచ్చాడు వీరనాథుడు.

వారిలో ఒక వ్యక్తి "రాజా! నేను చాలా పేదవాడిని. నాకు ధనమిచ్చి ఆదుకోండి" అన్నాడు. వెంటనే కావలసినంత ధనమిచ్చి పంపాడు వీరనాథుడు.

రెండవ వ్యక్తి "రాజా! నాకు ఉండడానికి ఇల్లు లేదు" అని చెప్పాడు. అతనికి నచ్చిన విధంగా భవనం కట్టి ఇమ్మని మంత్రులకు ఆజ్ఞాపించాడు వీరనాథుడు.

మూడవ వ్యక్తి "రాజా! నాకు ఉద్యోగం ఏదైనా ఇప్పించండి" అని

ప్రార్థించాడు. వెంటనే రాజు తన అనుచరులతో చర్చించి అతని అర్హతలకు సరిపడే పదవిలో నియమించాడు.

నాలుగవ వ్యక్తి పేరు సాంబుడు. అతడు రాజుగారికి వెంటనే తన కోరిక చెప్పలేదు. అప్పుడు వీరనాథుడు "నీవు భయపడనవసరం లేదు. ఏది కోరినా మన్నిస్తాం" అని హామీ ఇచ్చాడు.

అప్పుడు సాంబుడు "రాజా! నెలలో ఓ పదిరోజులు మీరు మా యింట గడిపే భాగ్యం కల్గించండి" అని కోరాడు.

ఆ కోరిక విన్న వీరనాథుడు ఆశ్చర్యపోయాడు. ఆ కోరిక కోరడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉందో అక్కడ వున్నవరికీ అర్థం కాలేదు. మిగతావారు లాభం వచ్చే కోర్కెలు కోరుకుంటే సాంబుడు ఒక్కడూ ఇలాంటి పిచ్చి కోరిక కోరడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

తర్వాత జరిగిన ఒక్కొక్క సంఘటనా చూసి అంతా ముక్కున వేలేసుకున్నారు.

"అలాగే' అని అంగీకరించాడు రాజు వీరనాథుడు.

సాంబుడి కోరిక రాజుగారు తీర్చే ముందు చాలా పనులు చేయవలసి వచ్చింది రాజుగారికి. సాంబుడు పేదవాడు. అతడికి సరైన గృహం,రాజుగారిని ఆదరించడానికి అవసరమైన దర్పం, ధనం అతడికి లేవు. అందుకని ముందుగా అతడికి మంచి భవనం ఏర్పాటు చేశారు. అతడికి అధికమొత్తంలో డబ్బు ఇచ్చి తగిన సౌకర్యాలు అమర్చుకోమన్నారు. అప్పటికీ ఆగక అతడింట రాజుగారు బసచేయాలంటే అతడి హోదా చాలదని భావించి అతడికి మంత్రి పదవి యిచ్చి గౌరవించారు.

ఈవిధంగా తెలివైన కోరిక కోరి మిగతా ముగ్గురికీ యిచ్చిన వేర్వేరు కానుకలన్నీ ఒకేసారి పొందాడు సాంబుడు.

(ఉదయం వారపత్రిక, 2-3-1990)



# కాల నిర్ణయం

ఒకానొక గ్రామంలో 'అతి గర్వం' అనే చెరువు, 'సౌమ్యం' అనే నదీ ఉండేవి. చెరువు, ఊరికి ప్రక్కగా ఉండేది. గ్రామస్తులు త్రాగేందుకు చెరువు నీటినే వాడేవారు. అప్పుడప్పుడూ నీటికి మరీ కరువు ఏర్పడినప్పుడు చెరువులోని నీటినే ప్రక్కకు పాయగా తీసి అందులో పశువులను కడిగేవారు. అలా నీటికోసం గ్రామస్తులంతా తన మీదనే ఆధారపడడం చెరువుకి గర్వకారణమయింది.

ఆ గ్రామానికి కొద్ది దూరంలో ప్రవహించేది సౌమ్యం! వేసవి కాలంలో మినహా మిగిలిన రెండు కాలాల్లోనూ ఎప్పుడూ కొత్త నీరుతో పొంగి పారలి



Scanned with CamScanner

పారుతుండేది. ఆ నీటిని వాడడానికి గ్రామస్తులు ఇష్టపడేవారు కాదు.

ఒకసారి అధికంగా వర్షాలు కురిసి, నది విపరీతంగా ప్రవహించ సాగింది. ప్రవాహ దిశగా అది చెరువుకి దగ్గరగా వెళ్ళసాగింది. దానిని గమనించిన 'అతి గర్వం' ఫకాలున నవ్వి యిలా అంది. "ఓసౌమ్యం! నీ ప్రవాహం నిరుపయోగం! నా జన్మ మాత్రమే ధన్యం! నీవు వెళ్ళి సముద్రంలో కలియడం వల్ల నీ నీరు ఉప్పుగా మారిపోతుంది. నీలో ఎప్పుడూ కొత్త నీరు కలియడం వల్ల, నిన్ను జనులు వినియోగించుకోవడం లేదు. ఎందుకు నీకీ జన్మ? హాయిగా నాలా చెరువులా ఏర్పడరాదూ!? నిన్నూ జనం వినియోగిస్తారు".

నవ్వి, అందుకు సమాధానంగా సౌమ్యం "ఇప్పుడు నేనేమీ జవాబివ్వలేను! సమయం వస్తుంది! అప్పుడు సహేతుకంగా సమాధానం యిస్తాను" అంది.

కాలచక్రం 'గిర్రు'న తిరిగింది. వేసవి కాలం వచ్చింది. ఎండ వేడిమికి నీరు ఆవిరి అయిపోయింది. వర్షాలు పడలేదు. దాంతో 'అతి గర్వం' ఎండిపోయింది. చెరువు ఎండిపోవడంతో జనం, అటు వైపు వెళ్ళడం మానుకున్నారు. దూరంగా ఉన్నా, నది వద్దకే వెళ్ళి నీరు వాడుకోసాగారు. పశువుల్ని కూడ నది వద్దకే తరలించేవారు. దీనిని గమనించిన 'సౌమ్యం' విర్రవీగలేదు సరికదా, సంతోషించింది.

అతి గర్వాన్ని చేర పిలిచింది. "చూడు మిత్రమా! ఆరోజు నువ్వెంతో గొప్పదానివలే భావించి నీతులు చెప్పావు! నీ మాటలు నమ్మి నేను చెరువుగా ఏర్పడి ఉంటే, నీ గతే నాకూ పట్టి ఉండేది! కాలానుగుణంగా మార్పులు రావడం సహజం! అందువలన సమస్యలు వచ్చినప్పుడు క్రుంగిపోవడం, లేని వేళ పొంగిపోవడం చేయరాదు! ఎవరి గొప్పతనం వారిది! ఏమంటావు" అంది.

దానితో అతిగర్వానికి కనువిప్పు కలిగింది!

(ఆంధ్రజ్యోతి దినపత్రిక)



Scanned with CamScanner

# ముసుగువీరుడు

ఆవూరు పేరు ధర్మాపురం! ఆ ఊరిలో రంగయ్య అని ఓ గొఱ్ఱెలకాపరి ఉండేవాడు. వాడు చాలా మంచివాడు. అతడు ప్రతిరోజూ గొఱ్ఱెలను దగ్గరలో ఉన్న అడవికి మేతకు తోలేవాడు. సాయంత్రం వేళకి ఊరులోకి వచ్చేవాడు.

అతడిభార్య రంగమ్మకి జబ్బుచేసింది. వైద్యుడిని పిలిచి చూపించాడు. ఆమెకు మందులిప్పించాలంటే చేతిలో సొమ్ములేదు. ఆమె ప్రాణం కాపాడాలంటే ఏం చేయాలో అతడికి తోచలేదు. ఇరుగు పొరుగు వారిని అప్పు అడిగితే ఎవరూ ఆ సమయానికి తమ వద్ద లేవన్నారు. రంగయ్య ఆఖరుకి వడ్డీ వ్యాపారి అయిన సుబ్బయ్యశెట్టి దగ్గరకు వెళ్ళాడు.

సుబ్బయ్యశెట్టి పరమ నీచుడు. అతడు వడ్డీ అధికంగా పుచ్చుకుంటాడు. చదువురానివాళ్ళు ఎవరైనా అప్పుకు వస్తే, వారికి ఎక్కువ సొమ్ము యిచ్చినట్టు పత్రం రాసి వారిని యిబ్బంది పెట్టేవాడు. ఇలాంటి నీచాలు ఎన్నో చేసి అంత సొమ్ము గడించాడు. రంగయ్యకు కొంత సొమ్ము అప్పు యిచ్చి దానికి హామీగా అతని యిల్లు, గొఱ్ఱెలు వ్రాశాడు పత్రంలో. ఇవేవీ తెలియని రంగయ్య సమయానికి ఆదుకున్న సుబ్బయ్యశెట్టిని పొగిడి వెళ్ళిపోయాడు.



రంగమ్మకు ఎన్ని మందులు వాడినా వ్యాధి నయం కాలేదు. ఆమె చనిపోయింది. ఆ ఖర్చులన్నీ పెరగడంతో రంగయ్య శెట్టి బాకీ తీర్చలేకపోయాడు. భార్యపోయిన విచారంలో ఉన్న రంగయ్య యింటికి వచ్చాడు సుబ్బయ్య!

"రంగయ్యా! నీవు నీ అప్పు వెంటనే తీర్చు! లేకపోతే నీ యిల్లు స్వాధీనపరచుకొని, గొఱ్ఱెలు తీసుకుపోతాను" అన్నాడు సుబ్బయ్యశెట్టి!

"బాబూ! నాకిచ్చిన ఆ కొద్ది మొత్తానికి ఇల్లు, గొఱ్ఱెలు ఎందుకు?" అని ఆశ్చర్యంగా అడిగాడు రంగయ్య!

"నీ కిచ్చినది కొద్ది మొత్తమా? అమ్మబాబోయ్.....పత్రం ఉంది కాబట్టి సరిపోయింది. లేకపోతే అబద్ధం ఆడేవాడివే!" అంటూ ఎంత యివ్వాలో చెప్పాడు సుబ్బయ్య!

రంగయ్యకు మతిపోయింది. తను అంత అప్పు తీసుకోలేదు. కానీ ఈ శెట్టి తనను మోసం చేయాలని చూస్తున్నాడు. అతడు ఎన్నివిధాల ప్రయత్నించి చెప్పినా సుబ్బయ్య అతని మాట వినడం లేదు.

"ఆఖరుసారిగా చెబుతున్నాను. అయిదు రోజుల్లో నీవు అప్పు వడ్డీతో సహా తీర్చకపోతే నా మనుషుల్ని పంపి నిన్ను బయటకు గెంటి నీ యిల్లు, గొఱ్ఱెలు స్వాధీనపరచుకుంటాను" అని చెప్పి వెళ్ళిపోయాడు సుబ్బయ్య!

రంగయ్య తన సమస్య పరిష్కరించమని గ్రామపెద్దను కలిశాడు. అతడికీ సుబ్బయ్యశెట్టికీ ఏవో లాలూచీలుండడం వలన అతడు సుబ్బయ్యశెట్టికి అనుకూలంగా మాట్లాడాడు.

"ఇది అన్యాయం" అని అరవడానికైనా అవకాశం లేనంతగా కృంగిపోతున్నాడు రంగయ్య! భగవంతుడిని ప్రార్థిస్తూ తన బాధలు తీర్చమన్నాడు. తన వద్ద చిల్లిగవ్వ అయినా లేదు. తను అప్పుతీర్చే స్థితిలో లేడని గ్రహించి సుబ్బయ్యశెట్టి తన మీద పడడం బాధ కలిగించింది.

* * *

ఈలోగా అయిదు రోజులూ గడిచిపోయాయి. సుబ్బయ్యశెట్టి పత్రం



Scanned with CamScanner

తీసుకుని రంగయ్య యింటికి వచ్చాడు. "రంగయ్యా! యిది ఆఖరుసారి నీకు హెచ్చరిక! సొమ్ము చెల్లించగలవా? లేక మనుషుల్ని పంపి స్వాధీన పరచుకోమంటావా?" అని అడిగాడు సుబ్బయ్యశెట్టి!

"బాబూ! మీరు నా ప్రాణం తీసినా నా అప్పు తీర్చలేను. నేను తీసుకున్నది కొంతే అయితే మీరు మరి మూడురెట్లు అడిగితే నేనెక్కణ్ణుంచి తేగలను? తీర్చకపోతే యిల్లు, గొఱ్ఱెలూ తీసుకోమని మీకు నేను చెప్పానా? లేదు! మరెందుకు అన్యాయంగా నన్ను దోచుకుంటారు?" అన్నాడు రంగయ్య బాధగా!

"ఏమిరా! నీకు కళ్ళు నెత్తి మీదకెక్కినట్లున్నాయ్! అప్పు తీసుకున్నది కాక అబద్ధం ఆడుతావా? ఇప్పుడే నీ పనిచెప్తాను" అంటూ పత్రం తీసుకుని అడుగు ముందుకు వేయబోయాడు.

ఎదురుగా ఒక వ్యక్తి నిలబడి ఉండడం చూసి ఆశ్చర్యపోయాడు. అతణ్ణి ఎప్పుడూ చూసి ఉండలేదు కూడా! అతడు తలకు ముసుగు వేసి ఉండడంతో పూర్తిగా గమనించే అవకాశం లేదు. సుబ్బయ్యశెట్టి ఆశ్చర్యం నుండి తేరుకోక మునుపే అతడి చేతిలోని పత్రం తీసుకున్నాడు ముసుగు మనిషి.

"ఏయ్! ఏమిటిది? నీకెందుకు అది?" గాభరాగా అడిగాడు సుబ్బయ్య! అతడు దానిని తనఅంగీలో దాచి, మరికొన్ని అలాంటి పత్రాలే బయటకు తీసి చూపాడు.

సుబ్బయ్యశెట్టి వాటిని చూస్తూనే మూర్ఛపోయాడు. అవన్నీ అతడు అక్రమంగా రాసి ఎందర్నో దోచుకున్న పత్రాలు! అవి యితడికెలా వచ్చాయి? అన్న ఆశ్చర్యం అతడిలో ఉంది!

ఆ ముసుగుమనిషి వైపు ఆశ్చర్యంగా చూస్తున్న రంగయ్యతో "రంగయ్యా! నీకు ఏ భయమూ లేదు. నిన్ను ఎవరూ ఏమి చేయలేరు. నీ పత్రం నేను తీసుకుపోతున్నాను" అంటూ వెళ్ళిపోయాడు.

రంగయ్య సంతోషంతో చేతులు జోడించాడు.

* * *



Scanned with CamScanner

ఆరోజు అమావాస్య! కళ్ళు పొడుచుకున్నా కానరాని చీకటి! అర్ధరాత్రి దాటిన సమయంలో పది గుర్రాలు పరుగుపెడుతూ వెళుతున్నాయి. అవి తిన్నగా హిమగిరి అనే గ్రామంవైపు వెళ్ళాయి.

ఆ డెక్కల చప్పుళ్ళు విని గ్రామస్థులు అంత నిద్రలోనూ ఉలిక్కిపడి లేచారు. భయంతో బిగుసుకుపోయారు. ఆ గుర్రాల చప్పుళ్ళు వారికి పరిచితమైనవే! ఆ గుర్రాల మీద వస్తున్నది బందిపోటు దొంగలు! వారు నరరూపరాక్షసులు! దయా ధర్మం లేదు వారికి! వారు వచ్చి గ్రామాన్ని దోచుకునిపోతారు. వారికి అడ్డుచెపితే ప్రాణం తీస్తారు.

ఆ గుర్రాలు ఊరు మధ్యకు వచ్చి ఆగాయి. వారి నాయకుడు గంగన్న వూరంతటికి వినబడేలా ఇలా కేకవేశాడు. "గ్రామస్థులారా! మీ మీ నగలు, డబ్బూ తెచ్చి ఇక్కడ పడేయండి! దాయడానికి ప్రయత్నించినా, పారిపోజూచినా ప్రాణాలు దక్కవు! మా అనుచరులు వచ్చి తర్వాత వెదకుతారు. అప్పుడు ఏమైనా కనబడితే మీ ప్రాణాలు నిలవవు" అన్నాడు.

ఆ కేకకు నిద్రలేవని వాళ్ళు కూడా లేచారు. వారిలో భయం ప్రవేశించింది. ఈ అన్యాయం తరచూ తమని పేదవాళ్ళని చేస్తున్నది. తాము ఏదో సంపాదించుకుంటే దానిని వీళ్ళు దోచుకుంటున్నారు. ఈ విధంగా వాళ్ళు అనేకసార్లు వారి పాలబడ్డారు.

వారేకాదు! ఆ చుట్టు ప్రక్కల అనేక గ్రామాలవారు అలా పీడింపబడుతూనే ఉన్నారు. వారు రాజుగారికి ఫిర్యాదు చేశారు. రాజభటులు దొంగల్ని పట్టుకోవడానికి ప్రయత్నించి విఫలులైనారు. దాంతో రాజుగారు కూడా "వారిని పట్టుకున్న వారికి పదివేలు బహుమానం" ప్రకటించారు. అయినా ఇంతవరకూ ఎవరూ అలా జరుగకుండా ఆపలేకపోయారు.

వారు మనసులోనే దేవుణ్ణి ప్రార్థించి "దేవా! ఈ అన్యాయాన్ని ఆపలేవా?" అని అడిగారు. వారి మొర ఆలకించాడా అన్నట్టు ఓ విచిత్రం జరిగిందక్కడ!



Scanned with CamScanner

గ్రామస్థులు భయంతో తమ తమ వస్తువులు తీసుకువెళ్ళి వారు చెప్పిన ప్రదేశంలో పడేయసాగారు. అంతలో దొంగల నాయకుడు ఓ అందమైన అమ్మాయిని పట్టుకుని ఆమెపై పడబోయాడు. గ్రామస్థులంతా ఆశ్చర్యపోయి చూస్తున్నంతలో మెరుపులాంటి వేగంతో అక్కడికొచ్చాడు ఒక ముసుగువీరుడు.

దొంగల నాయకుణ్ణి చిత్తుచేసి అమ్మాయిని రక్షించాడు. మిగతా దొంగలు అతనిపై ఒక్కసారి పడ్డారు. అతడు అదే వేగంతో ఒక్కొక్కరిని ఎదిరించి వారిని కీళ్ళకు కీళ్ళు విరిచి లేవలేనట్లు చేశాడు.

ఆ గ్రామస్థులనడిగి బలమైన త్రాడుతో వారిని కట్టగాకట్టి ఓ చోట పడేశాడు. తర్వాత గ్రామస్థులంతా అతనికి కృతజ్ఞతతో నమస్కరిస్తుంటే వారిని వారించి "మీరు మీ మీ నగలు, డబ్బూ తీసుకోండి! ఇక మీరు దొంగల గురించి భయపడవలసిన పనిలేదు. ఈ దొంగల విషయం రాజుగారికి చెపితే భటులని పంపి వీళ్ళను తీసుకు పోతారు. వీరిని మీ గ్రామస్థులే పట్టుకున్నట్లు చెప్పి వచ్చే ఆ బహుమానంతో మీ గ్రామాభివృద్ధికి పాటుపడండి!" అంటూ ఎలా వచ్చాడో అలాగే మాయమయ్యాడా వీరుడు.

* * *

ఆ రాజ్యంలో ఎక్కడ చూసినా ఒకటే విషయం గురించి చర్చిస్తున్నారు. అదేమిటంటే-ఎక్కడ అన్యాయం జరిగినా, అక్రమం జరిగినా ఎక్కణ్ణుంచో వచ్చి 'ముసుగువీరుడు' వాటిని ఆపుతున్నాడు.

మహారాజు మంగళుడు ఈ వార్త విని ఆశ్చర్యపోయాడు. "ఒక ముసుగువీరుడు వచ్చి యిలా అన్యాయాలను ఆపడం బాగానే ఉంది. కానీ అతడు మనల్ని కలుసుకుంటే బాగుంటుందేమో! అలాంటి వీరుడు మన సైన్యంలో ఉంటే మనకు బలం చేకూరుతుంది కదా?" అన్నాడు మంత్రితో!

"అవును ప్రభూ! కాని ఆ వీరుడి అంతరంగం ఏమిటో అర్థం కావడంలేదు. అతడు ఆయా అక్రమాలను ఆపుతున్నాడు కానీ వాటికి ప్రకటించిన బహుమతులు తీసుకోవడంలేదు. అసలు తానా పని చేసినట్టు



Scanned with CamScanner



చెప్పవద్దని వారితో చెబుతున్నాడు. ఆశ్చర్యంగానే ఉంది" అన్నాడు మంత్రి మధురుడు.

రాజు క్షణకాలం తల పంకించి "మంత్రీ! మనం అతడిని యిక్కడకు వచ్చి కలుసుకొమ్మని చాటింపు వేయిస్తే బాగుంటుందేమో!" అన్నాడు.

"అలాగే ప్రభూ! యిప్పుడే ఏర్పాటు చేయిస్తాను" అన్నాడు మంత్రి. ఆవిధంగా చాటింపు వేశారు. కాని ఫలితం లేకపోయింది.

మళ్ళీ మంత్రి,రాజు ఆలోచించి మరో విధంగా చాటింపు వేయించారు. "ముసుగు వీరుడు వచ్చి రాజుగారిని కలుసుకుంటే అతడికి ఘనంగా సన్మానం చేసి విలువైన బహుమతులిస్తారని" దాని సారాంశం! ఇది జరిగి నెలరోజులు దాటినా ఎవరూరాలేదు.

కాని వేరొక వైపు ముసుగువీరుడు తన పని తాను చేస్తున్నాడు. అన్యాయాలని, దౌర్జన్యాలని ఆపుతున్నాడు. దీంతో రాజభటుల పని సులభమైంది. అసలు ఫిర్యాదులే రావడం మానేశాయి. వారి పని బాగుంది.

రాజ్యంలో శాంతిభద్రతలు మళ్ళీ బాగుపడుతున్నాయి. కాని అవి రాజభటుల వల్ల కాకపోవడం రాజుగారికి విచారంగా ఉంది. తన పరిపాలనలో తన వల్లకాకుండా మరొకడెవడో ముసుగువీరుడు యిలా

శాంతి స్థాపనకు కృషి చేయడం బాధనిపించింది.

ఈసారి మరో ప్రకటన చేయించాడు. అందులో సారాంశం యిది. "ముసుగువీరుడు వచ్చి రాజుగారిని కలుసుకుంటే ప్రస్తుతం ఖాళీ ఉన్న ఉపసైన్యాధిపతి పదవి అతనికిచ్చి గౌరవిస్తారు."

ఇది జరిగి నెలదాటినా ఎవరూ రాలేదు. రాజుగారికి ఆశ్చర్యం వేసింది. ఈ ముసుగు వీరుడు పదవికీ, ధనానికీ, పేరు ప్రతిష్ఠలకీ దేనికీ లొంగడంలేదు. అతడి అసలు ధ్యేయం ఏమిటో ఎవరికీ తెలియడంలేదు. రాజు మంగళుడు ఈసారి ఈ వీరుడి ఒక్కో విజయాన్ని వింటూ ఆందోళన చెందుతున్నాడు. తనభటుల్ని పంపి అలాంటి వీరుడు ఎక్కడున్నా వెతికి తెమ్మని ఆజ్ఞాపించాడు. కాని ఫలితం శూన్యమయింది.

రాజు ఆందోళనకు కారణం లేకపోలేదు. అలాంటి వీరుణ్ణి విచ్చలవిడిగా వదలడం తన రాజరికానికే భంగం! రాజభటులు యింత దద్దమ్మలా అన్న భావం అతడికి కలిగిందంటే ముసుగువీరుడు తనను ఎదిరించడానికే ప్రయత్నించవచ్చు! అతడు యింతవరకూ తనకు అనుకూలమగు చర్యల్లో విజయం సాధిస్తున్నాడు. యికముందు అతడిలో చెడు ప్రవేశించి తననే వ్యతిరేకిస్తే? అప్పుడు అతనిని ఎలా పట్టగలరు?

రాజు మంగళుడు తన బాధనంతా మంత్రితో చెప్పాడు. మంత్రి మధురుడు దీర్ఘంగా ఆలోచించి "రాజా! ఈసారి నేను మంచి పథకం వేశాను. ఈసారి ముసుగువీరుడు మనకు దొరుకుతాడు. మీరేమీ ఆందోళన చెందవలసిన అవసరం లేదు" అన్నాడు.

"వెంటనే అమలు చెయ్యండి", రాజు ఆజ్ఞాపించాడు.

* * *

రాజభటులు కొందరు దొంగల వేషంవేశారు. మరికొందరిని మంగాపురం అనే గ్రామం పంపి సాధారణ పౌరుల్లా ఉండమని చెప్పారు. వారు వెళ్ళి రాత్రికి దొంగలు రాబోతున్నారని ముందే గ్రామంలో చాటేశారు. అందరిలో భయం కల్గింది. ఈ వార్త చుట్టు ప్రక్కల గ్రామాలకి అప్పుడే



Scanned with CamScanner

తెలిసిపోయింది-అలా ఆ వార్తకి ప్రాముఖ్యత యిచ్చి చాలా దూరం వ్యాపించేలా చేశారు.

ఆ రాత్రికి భటులు దొంగల్లా ఆ గ్రామం ప్రవేశించారు. దొంగల్లా నటిస్తూ గ్రామస్థులను భయపెడుతూన్న సమయంలో వచ్చాడు ముసుగువీరుడు. అతడు భటులను ఎదిరిస్తున్నంతలో గ్రామస్థుల్లా వేషాలు వేసిన భటులు చుట్టూ కమ్మి అతడిని పట్టుకున్నారు.

గ్రామస్థులు ఆశ్చర్యపోయి చూస్తున్నంతలో భటులు తమ వేషాలు తొలగించి "దొంగతనం అనేది కల్పన మాత్రమే! ముసుగువీరుడిని బంధించాలని ఈ పథకం వేశారు మంత్రిగారు" అంటూ చెప్పి అతడిని తీసుకుని రాజధానికి బయలుదేరారు.

* * *

మరునాడు రాజుమంగళుడి సమక్షంలో ముసుగువీరుడిని నిలిపారు. రాజు అతడిని చూస్తూ "ముసుగువీరుడిగా ఉండడానికి యిష్టపడినంతగా మా సమక్షంలోకి రావడానికి యిష్టపడలేదేం? నేను మంచిగా పిలిచి చట్టాన్ని నీ చేతుల్లోకి తీసుకున్నావని శిక్షిస్తాననుకున్నావా?" అని అడిగాడు.

ముసుగువీరుడు ఆ మాటలు విని ముసుగు తొలగించాడు. అందరూ ఆశ్చర్యంతో అతనిని చూశారు. అతడు పాతిక సంవత్సరాలు నిండిన అందమైన యువకుడు. అతడు యిలా అన్నాడు. "రాజా! మీరు శిక్షిస్తారన్న భయం నాకు ఏనాడూ లేదు. మంచివాడిని శిక్షించేంత క్రూర మనస్కులు మీరు కారని నాకు తెలుసు. మరి నేను రహస్యంగా మాత్రమే ఉండడానికి కొన్ని కారణాలున్నాయి. ఆ కారణాలు చెప్పాలంటే ముందు నాకథ చెప్పాలి" అన్నాడు.

రాజుతోబాటు, మంత్రులూ, సభికులూ అందరూ ఆశ్చర్యపోయి అతడు చెప్పింది వింటున్నారు. మంగళుడు ఆలస్యాన్ని భరించలేనట్లుగా-



Scanned with CamScanner

"చెప్పు బాబూ! ఏమిటి నీ కథ" అన్నాడు.

అప్పుడా యువకుడు "రాజా. నేను చిన్నప్పుడే నా తల్లిదండ్రుల నుండి తప్పిపోయాను. నేను ఓ దొంగలముఠా వారికి దొరికి వారిచే పెంచుకోబడ్డాను. వారు నన్ను తమ స్వంత వ్యక్తిలా భావించి విద్యలన్నీ నేర్పారు. ముఖ్యంగా నాకు యుద్ధవిద్యలూ, ఆత్మరక్షణ విద్యలూ నేర్పారు. కాని యివన్నీ దొంగతనాలు చేయడానికి మాత్రమే వారు ఉపయోగిస్తారు. నాకు చిన్నప్పటి నుండి వారి వృత్తిమీద, వారిమీద కోపం ఉండేది. యితరుల్ని దోచుకోవడం అంటే నాకు సరిపడదు. కానీ అవకాశం వచ్చి తప్పించుకోగలిగినంత వరకూ తప్పదనుకుని అక్కడ ఉన్నాను. నేను వారి తరపున కొన్ని దొంగతనాలు చేశాను. నేను అక్కడే ఉంటే నాయకుడి స్థానాన్ని పొందవలసినవాణ్ణి. అలాంటి నన్ను వదులుకోడానికి వారు సిద్ధంగా లేరు. కాని నేను ధైర్యం చేసి తప్పించుకున్నాను.

అప్పటినుంచి నా ఉనికి వారికి తెలియకుండా ఉండాలని నేను ముసుగువీరుడి రూపం దాల్చాను. వారు నా కోసం శతవిధాలా ప్రయత్నించి విఫలమయ్యారు. అలాంటి సమయంలో మీరు నన్ను కలుసుకొమ్మని



ప్రకటించారు. నేను నారూపం బయటపెడితే వారికి దొరికే అవకాశం ఉంది. అంతేగాకుండా మునుగువీరుడు ఫలానా విధంగా ఉంటాడని ఎవరికీ తెలియకపోవడం వల్లనే నేనంటే భయం, భక్తి ఉంటాయని నా నమ్మకం! అందుకే నేను బయటపడలేదు.

ఒకవేళ నేను మిమ్మల్ని కలుసుకుని మీరిచ్చే పదవులు నిర్వహించ బోయేనే అనుకోండి. నామీద పగబట్టి వచ్చి 'నేను దొంగనని' చెప్తే మీరు నమ్మి ఏదైనా చేయవచ్చు'. నాకు నేనే పరిచయం చేసుకున్న తర్వాతనే మిమ్ము కలుసుకోవాలని అనుకున్నాను. ఇప్పుడు అదే జరిగింది" అన్నాడు.

రాజు అతడిని చూస్తూ ఆనందంగా "బాబూ నీకన్న తల్లిదండ్రులెవరో ధన్యులు! నీలాంటి మంచివాణ్ణి, వీరుణ్ణి కన్నందుకు వారిని పొగడాలి" అన్నాడు.

అంతలో మంత్రి లేచి "రాజా! నాదో అనుమానం గతంలో తప్పిపోయిన నా కుమారుడు యితడేనని నాకనిపిస్తున్నది" అన్నాడు. అందరూ ఆశ్చర్యపోతూ చూడగా పుట్టు మచ్చలను బట్టి పరీక్షించారు. అతడేనని తేలింది.

మంత్రి మధురుడు "బాబూ! విజయా" అంటూ కౌగిలించు కున్నాడు. రాజుమంగళుడు అప్పటికప్పుడే యిలా ప్రకటించాడు.

"ఇన్నాళ్ళూ మునుగువీరుడిగా అనేక విజయాలు సాధించి అభిమానం దోచుకున్న విజయుడు మంత్రికుమారుడే అని తెలిసి ఒక నిర్ణయం తీసుకున్నాను. యువరాణి విజయలక్ష్మిని విజయుడికిచ్చి వివాహం చేసి విజయుడిని నా తర్వాత రాజు చేయాలనుకుంటున్నాను" అన్నాడు. అంతే! సభ హర్షధ్వానాలతో మారుమోగిపోయింది. ఒక శుభముహూర్తాన వారి వివాహం జరిగింది.

(బాలరంజని)



Scanned with CamScanner




# చిలుకజోస్యం

వీరయ్య ఒట్టి సోమరి. ఏ పనీ చేసేవాడు కాదు సరికదా భవిష్యత్తు గురించి కలలు కంటుండేవాడు. తల్లిదండ్రుల ద్వారా వచ్చిన యిల్లు, డబ్బుతోనే కాలం గడిపేసేవాడు.

ఓసారి వీధిలోకి చిలుకజోస్యం చెప్పేవాడు వస్తే పిలిచి జాతకం చెప్పమన్నాడు. వాడు చిలుక ముందు కొన్ని చీటీలు పరిచి ఒకదాన్ని తీయించాడు. అందులో 'తొందరలోనే రాజు కాగలవు.' అని ఉంది. అంతే! వీరయ్య ఎగిరి గంతేశాడు. తనకు రాజయోగం పట్టినట్లు, ఆస్థాన



Scanned with CamScanner

ఉద్యోగులు, సేవకుల మధ్య సింహాసనంపై కూర్చున్నట్లు ఊహించుకోసాగాడు.

'ఆస్తి నిలబెట్టుకోడానికి నీ ప్రయత్నం నువ్వు చెయ్యి నాయనా? లేకపోతే ఇబ్బంది పడతావు' అంటూ కొందరు సలహా యిచ్చినా పెడచెవిన పెట్టేశాడు.

కొన్నాళ్ళలోనే వీరయ్యకి ఉన్నది కాస్తా కరిగిపోయింది. ఆఖరికి పొట్టగడవని స్థితికి దిగజారిపోయాడు.

ఏదైనా పని చేద్దామన్నా ఏదీ చేతకాక కట్టుబట్టలతో గ్రామాలు పట్టిపోయాడు. ఎన్ని కష్టాలు పడుతున్నా మనసులో మాత్రం చిలుక జోస్యం గుర్తొచ్చేది. రోజులు మారకపోతాయా? అని అనుకునేవాడు.

ఓసారి ఓ గ్రామంలో గుడి దగ్గర ప్రసాదం పంచుతుంటే వెళ్ళి వరసలో నుంచున్నాడు. ఇంతలో యిద్దరు వృద్ధదంపతులు వచ్చి 'నాయనా! నువ్వు అచ్చం మా అబ్బాయిలాగే కనిపిస్తున్నావు. వాడు కొంతకాలం క్రితం పాముకాటు వల్ల చనిపోయాడు. నువ్వేమీ అనుకోకపోతే మాతోనే ఉండిపో. నీలో మా అబ్బాయిని చూసుకుంటాం' అన్నారు.

ఏ పనీ చేయకుండా రోజూ తిండి గడిచిపోయే మార్గం దొరికిందనుకున్న వీరయ్య సరేనన్నాడు. ఆ వృద్ధదంపతులు అతడిని తమ యింటికి తీసుకెళ్ళారు. అదొక పూరిగుడిసె. వాళ్ళిద్దరూ బిచ్చగాళ్ళు. ఇంటికి రాగానే వాళ్ళు 'నాయనా! ముగ్గురం మూడు వీధులకు వెళ్ళామంటే రోజు గడచిపోతుంది. నీ పేరు ఏదైనా సరే మేము మాత్రం నిన్ను రాజు అని పిలుస్తాం. అది మా అబ్బాయి పేరు. నువ్వు కాదనకూడదు' అన్నారు.

వెంటనే వీరయ్యకి చిలుక జోస్యం గుర్తొచ్చింది. 'రాజువు కాగలవు' అన్నది ఇలా నిజమైందన్నమాట అనుకున్నాడు. జాతకం మీద నమ్మకంతో ఆస్తిని పోగొట్టుకున్న తనకిది తగినశాస్తే అనుకున్నాడు.

(ఈనాడు దినపత్రిక)



Scanned with CamScanner



# తాయెత్తు మహిమ!

పదోతరగతి చదువుతున్న రామం పరీక్షలకు బాగానే సిద్ధమయ్యాడు. కానీ తన మీద తనకే నమ్మకం తక్కువ. చదివింది రాదేమోనని, వచ్చింది మర్చిపోతానేమోనని భయం. తండ్రి విశ్వనాథం ఎంత ధైర్యం చెప్పినా రామంలో పిరికి ఆలోచనలు పోలేదు. చదువు కుంటుపడింది. బెంగతో సరిగా అన్నం కూడా తినడం మానేశాడు.

విశ్వనాథం ఓరోజు, 'హిమాలయాల నుంచి ఓ సాధువు వచ్చారు. పరీక్షల ముందు ఆయన ఆశీర్వచనం తీసుకుంటే మంచిది పద' అంటూ కొడుకుని బయల్దేరదీశాడు.

బారెడు గడ్డంతో కాషాయ వస్త్రాలు ధరించి వున్న ఆ సాధువు రామాన్ని చూసి "నీ సమస్య ఏమిటి నాయనా?" అని అడిగారు.

'చదివింది మర్చిపోతానని బెంగగా ఉంది' అన్నాడు రామం.

సాధువు చిరునవ్వు నవ్వి రామాన్ని ఆశీర్వదించి, జోలె లోంచి ఓ



Scanned with CamScanner

తాయెత్తు తీసి ఇచ్చారు. 'ఇది మంత్రించిన తాయెత్తు. దీన్ని జబ్బకి కట్టుకున్నావంటే పరీక్షల్లో విజయం నీదే' అన్నారు.

రామం ఆనందానికి అంతులేదు. దాన్ని కట్టుకోగానే ఎంతో ధైర్యం వచ్చినట్టయింది. చకచకా చదవసాగాడు. పరీక్షల్లో జవాబులన్నీ చక్కగా రాయగలిగాడు. ఫలితంగా మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు.

'నాన్నా! మనం ఓసారి ఆ సాధువు దగ్గరకి వెళ్దాం' అన్నాడు రామం.

'ఆయన్ని నేను భోజనానికి పిలిచాను. కాసేపట్లో వస్తారు' అన్నాడు విశ్వనాథం.

కాసేపటికి విశ్వనాథం స్నేహితుడు పరంధామం వచ్చి రామాన్ని పలకరించి 'నీకిన్ని మార్కులు వస్తాయని నేను అనుకోలేదు తెలుసా?' అన్నాడు.

'నేనూ అనుకోలేదు. ఇదంతా తాయెత్తుమహిమ' అన్నాడు రామం.

'తాయెత్తులూ, మహిమలూ ఉండవని తెలీదా? చదువుకున్న వాడివైనా యిలా మాట్లాడతావేం?' అన్నాడు పరంధామం.

రామం దానికి ఒప్పుకోలేదు. 'ఇప్పుడు సాధువుగారొస్తారు. మీరే చూద్దురుగాని ఆయన తాయెత్తు యిస్తే మీ సమస్యలు కూడా తీరిపోతాయి' అన్నాడు.

'ఆ సాధువు రాడు. ఎందుకంటే నీకు తాయెత్తు ఇచ్చింది నేనే కాబట్టి' అంటూ పరంధామం తన చేతి సంచిలోంచి పెట్టుడు గడ్డం తీసి తగిలించుకున్నాడు. దాంతో రామానికి ఇదంతా తండ్రి తన స్నేహితుడితో ఆడించిన నాటకమని అర్థమైంది.

'నీలో భయం పోవాలనే యిలా చేశాం. ఇంతకీ ఆ తాయెత్తులో ఏ మంత్రం రాసుందో చూడు' అన్నాడు పరంధామం. రామం తాయెత్తు విప్పి చూస్తే, 'కష్టేఫలీ' అని ఉంది. ఇప్పుడు రామం ఆమంత్రాన్ని ఒంటపట్టించుకున్నాడు. (ఈనాడు దినపత్రిక)



Scanned with CamScanner



# దురాశకి మిగిలేదంతే!

ఊళ్ళో వెలిసిన కొత్తదుకాణం పెద్ద సంచలనమే సృష్టించింది. అక్కడ ఏ వస్తువైనా సగం ధరకే లభిస్తుంది. అయితే పదిహేను రోజులకు ముందే సొమ్ము చెల్లించాలి. డబ్బు దాచుకుంటే ఆరు నెలల తర్వాత దానికి రెట్టింపు యిస్తారు.

చాలామంది వస్తువులకి డబ్బు కట్టారు. ధనికులు భారీగా డబ్బు దాచారు. అదే వూళ్ళో వుంటున్న సుబ్బయ్యతో అతడి భార్య 'మనం కూడా సొమ్ము చెల్లించి వద్దామా?' అంది.

'ఏవ్యాపారైనా నష్టానికి అమ్ముతాడా? అదే నా అనుమానం' అన్నాడు సుబ్బయ్య.

'అదేదో వాళ్ళనే అడగొచ్చుగా?' అంది భార్య. సరేనని సుబ్బయ్య

ఆ దుకాణానికి వెళ్ళి అడిగాడు. దానికి అక్కడి వాళ్ళు 'మాకు చాలా వ్యాపారాల్లో లాభాలు వస్తున్నాయి. వస్తువులన్నింటినీ నేరుగా పరిశ్రమల నుంచి తెస్తాం. నలుగురికీ మంచి చేయాలని యిలా చేస్తున్నాం' అన్నారు.

సుబ్బయ్య వెంటనే కొన్ని విలువైన వస్తువులు ఎంచుకుని, సగం ధర చెల్లించాడు. తన వద్ద వున్న రొక్కాన్ని కూడా దాచి వచ్చాడు. ఆ మర్నాటి నుంచీ సుబ్బయ్యకి నిద్రపట్టడం మానేసింది. రోజూ అర్థరాత్రి వేళ ఆ దుకాణం దగ్గరకి వెళ్ళి చూసి వస్తుండేవాడు. ఓరోజు అలాగే వెళ్ళేసరికి ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్నారు.

'ఊళ్ళో ధనవంతులందరూ సొమ్ము దాచారు. దుకాణం ఖాళీ చేసేద్దాం' అనుకుంటున్నారు వాళ్ళు. గుండె గుభేల్మన్న సుబ్బయ్య వారి ముందుకి వురికి 'అనుమానిస్తూనే వున్నాను. ఇదన్నమాట మీ ఎత్తు?' అన్నాడు.

వాళ్ళు వెంటనే అతడిని పక్కకు తీసుకుపోయి 'నువ్విచ్చిన సొమ్ముకి యిప్పుడే రెట్టింపు యిస్తాం. మమ్మల్ని వెళ్ళనియ్యి' అంటూ ఓ సంచి నిండా నోట్ల కట్టలు పెట్టి యిచ్చారు. సుబ్బయ్య తబ్బిబ్బయిపోయి మారుమాటాడకుండా సంచి తీసుకుని వచ్చేశాడు.

మర్నాడు వూరంతా గగ్గోలయిపోయింది. నిద్రపోతున్న సుబ్బయ్యను భార్య లేపి, 'ఆ దుకాణం వాళ్ళు బిచాణా ఎత్తేశార్ట' అంది గాభరాగా.

సుబ్బయ్య నవ్వి, 'ష్....కంగారు పడకు' అంటూ వెళ్ళి అటక మీద దాచిన సంచి తీసుకొచ్చి ఒంపాడు. నోట్లకట్టలు కుప్పగా పడ్డాయి. లెక్క పెడదామనుకుని చూస్తే అవన్నీ పిల్లలు ఆడుకునే డబ్బు కాగితాలు, ఎందుకూ పనికి రానివి!

తెల్లబోయిన సుబ్బయ్య 'రాత్రే' అందరినీ లేపి 'ఉంటే వూరందరికీ మేలు జరిగేది. స్వార్థంతో నష్టపోయా' అనుకుని తేలుకుట్టిన దొంగలా మిన్నకుండిపోయాడు. (ఈనాడు దినపత్రిక)



# మూడు....ఆరు

సదానందుడనే గురువు వద్ద విద్య పూర్తి చేసుకున్న వర్ధనుడు, సాధనుడనే శిష్యులిద్దరూ రాజుగారి కొలువులో ఉద్యోగాలు సంపాదించారు. వర్ధనుడు క్రమంగా అవినీతిపరుడిగా మారి ఆస్తి కూడబెట్టాడు.

సాధనుడు ఓసారి సదానందుడిని చూడవచ్చి వర్ధనుడి గురించి చెప్పి, 'మీమాటగా ఏమైనా చెప్పమంటారా?' అని అడిగాడు. సదానందుడు వేదాంతధోరణిలో నవ్వి, 'మూడు....ఆరు' అన్నాడు. దానికి అర్థం తెలియని సాధనుడు అక్కడి శిష్యులను అడిగాడు. దానికి వాళ్ళు, 'వర్ధనుడి గురించి యిప్పటికే కొందరు చెప్పారు. అందరితోనూ ఆయన మూడు, ఆరనే అన్నారు. అర్థం మాకూ తెలియదు.' అన్నారు.

సాధనుడు రాజధానికి తిరిగి వచ్చి వర్ధనుడిని కలిసి, 'గురువుగారికి నీ గురించి చాలా మంది చెప్పారు' అన్నాడు.

'గురువుగారు ఏమన్నారు?' అన్నాడు వర్ధనుడు.

"మూడు, ఆరు అని నీకు చెప్పమన్నారు. దానర్థం ఏమిటో మరి?' అన్నాడు సాధనుడు.

వర్ధనుడు నవ్వి, "నాలా బతకనేర్చినవాడి పని మూడు పువ్వులు, ఆరుకాయలుగా వుంటుందని అయి వుంటుందిలే' అన్నాడు.

'అలా ఎందుకనుకోవాలి? అవినీతి బయటపడితే నీకు మూడు వందల జరిమానా, ఆరు నెలల జైలు పడుతుందని కావచ్చుగా?' అన్నాడు సాధనుడు కోపంగా.

'ఆయన మాటల్లో అర్థం ఏమయినా నా తీరు యింతే" అంటూ వర్ధనుడు మొండిగా జవాబిచ్చాడు.

కొంతకాలానికి వర్ధనుడి భార్యకు ఏదో తెలియని రోగం పట్టుకుంది. కొడుకులు వ్యసనాలకు బానిసలయ్యారు. తీర్థయాత్రలకి వెళ్ళిన తల్లిదండ్రులిద్దరూ వరదల్లో కొట్టుకుపోయారు. ఈసమస్యలతో కుంగిపోయిన వర్ధనుణ్ని సాధనుడు ఓదార్చి గురువు సదానందుడి దగ్గరకు తీసుకెళ్ళాడు.

వర్ధనుడి బాధలన్నీ విన్న గురువుగారు వేదాంతధోరణిలో 'మూడు....ఆరు' అన్నారు.

"ఊరట పొందాలని వస్తే వెక్కిరిస్తున్నారా గురువుగారూ" అన్నాడు వర్ధనుడు బాధగా.


"చాలా మందితో నీకీ మాట చెప్పమని కబురంపాను నాయనా. నువ్వు వచ్చి అర్థం అడుగుతావని ఆశించాను. నువ్వు రానేలేదు."

"మీమాటకు అర్థం వివరించండి స్వామీ" అన్నాడు వర్ధనుడు.

"ఏముంది నాయనా? ఎంత కూడబెట్టినా చనిపోయినప్పుడు మనిషితో కాటి వరకూ వచ్చేది మూడు మూరల గుడ్డ, పాతిపెట్టడానికి అవసరమయ్యేది ఆరడుగుల జాగా" అన్నారు గురువుగారు.

సిగ్గుతో తలవంచుకున్న వర్ధనుడు ఆపై అవినీతి పనులకు పాల్పడలేదు.

(ఈనాడు దినపత్రిక)



# శుభం

కనకపురిలో నివసించే కామేశంకు మూఢనమ్మకాలు ఎక్కువ. బయట అడుగుపెట్టాలంటే శకునం చూడనిదే కదలడు. అత్యవసరపని అయితే అసలే చెప్పక్కర్లేదు. కామేశం తండ్రి కనకయ్యకి వున్న నమ్మకాలు క్రమేణా అతనికి వచ్చేశాయి.

పిల్లి ఎదురైతే అశుభంగా భావించేవాడు. పిల్లి కన్పించినా, వితంతువు ఎదురొచ్చినా అపజయం కలుగుతుందని నమ్మేవాడు. దానికి తోడు అతడు పుట్టింది, పెరిగింది, వుంటుంది పల్లెటూరు కావడంతో ఆ నమ్మకాలు యిప్పటికీ పాటిస్తున్నాడు.

కొన్నాళ్ళకి కామేశం తల్లీ, తండ్రీ మరణించడం, అతడి ఆస్తిని దాయాదులు కాజేయడంతో పూట గడవడం కష్టమైంది. దారీతెన్నూ తెలియక దిక్కుతోచని స్థితిలో వున్న అతనికి దూరపుబంధువు విశ్వం గుర్తుకు వచ్చాడు.

విశ్వం అతని తల్లి తరుపు బంధువు. తల్లి బతికుండగా విశ్వం మంచితనం, గొప్పతనం గురించి ఎన్నోమార్లు చెప్పింది. అందువల్ల తనకు



Scanned with CamScanner

ఈ ఆపద సమయంలో ఏదైనా దారిచూపుతాడని నమ్మకం కలిగి అక్కడికి బయల్దేరాడు.

విశ్వం రాజధానిలో ప్రభుత్వఉద్యోగం చేస్తూ మంచి స్థితిలో వున్నాడు. అతనికి నగరంలో పరపతి, పలుకుబడి వున్నాయి. అయితే అతడు నాస్తికుడు.

తన ఇంటికి వచ్చిన కామేశాన్ని గుర్తించి, కుశలప్రశ్నలు వేసి అతిథిమర్యాదలు ఘనంగానే చేయించాడు. తరువాత విశ్రాంతి వేళలో కామేశం వచ్చినపని తెలుసుకున్నాడు.

దానికి విశ్వం 'ఈనగరంలో నాతో పనులు చేయించుకున్న పెద్దమనుషులు చాలామంది వున్నారు. నేను సిఫారసు ఉత్తరం రాసి నీ పరిచయంతో కూడిన కాగితం యిస్తాను. వారి పేర్లు, చిరునామాలు రాసిస్తాను. నువ్వు వారిని కలిస్తే వారి యింట్లోగానీ, కార్యాలయంలో గానీ నీ అర్హతకు సరిపడే ఉద్యోగం తప్పక యిస్తారు' అని చెప్పాడు నమ్మకంగా.

కామేశం ఆమాటలతో వూరట చెందాడు. మరునాటి నుండి తన ప్రయత్నం ప్రారంభించాడు. ప్రతిరోజూ వెళ్ళి కొంతమందిని కలిసేవాడు. వారంతా విని ప్రస్తుతం ఖాళీలేదని చెప్పేవారు. అలా పదిహేను రోజులు గడిచిన పిదప అతనికి విసుగు కలిగింది. ఆ విసుగులో తను శకునం చూడకుండా వెళ్ళబట్టే పని దొరకడం లేదని గుర్తొచ్చింది.

ఆ విషయం విశ్వంతో చెప్పి 'నాకు శకునం చూడందే బయటకు వెళ్ళే అలవాటు లేదు. ఇక్కడికొచ్చిన తర్వాత వీలు కుదరడం లేదు. అందుకే నాకు పని దొరకడం లేదు' అని చెప్పి బాధపడ్డాడు కామేశం.

దానికి విశ్వం 'అలాగా! మన పొరుగింటి మంగమ్మది చాలా దశగల ముఖమని అంతా అంటుంటారు. రేపు ఆ అమ్మాయి ఎదురు రాగా నువ్వు బయల్దేరు!' అని చెప్పడంతో కామేశం సంబరపడిపోయాడు.



Scanned with CamScanner

మరునాడు విశ్వం చెప్పినట్లుగానే కామేశం పనిమీద బయటకు వెళ్ళాడు. అదేంటో కానీ ఆశ్చర్యంగా అతనికి ఒక కార్యాలయంలో పని దొరికింది. అతడి సంతోషానికి అంతులేదు.

ఆ సాయంత్రం విశ్వంను కలిసి 'మంగ ఎదురొస్తే పని జరుగుతుందని తెలిసీ ముందే ఎందుకు చెప్పలేదు. ఈ ఉద్యోగం యింకా ముందుగానే నాకు వచ్చి వుండేది' అని అతని చేతిలో మిఠాయి పెట్టి చెప్పాడు. విశ్వం మౌనంగానే ఉన్నాడు.

కామేశం పక్క యింట్లో వుండే మంగమ్మని కూడా కలిసి మిఠాయి యిచ్చి శుభవార్త చెప్పాలని వెళ్ళి శిల్పంలా నిల్చుండిపోయాడు. కారణం! మంగమ్మ వితంతువు. ఆమె భర్త ఫొటో గోడకు వేలాడుతోంది. అతనికి నోట మాట రాలేదు. వెనక్కి వచ్చి తను చూసింది చెప్పాడు.

అప్పుడు విశ్వం 'మంగమ్మది నిజంగా దశగల ముఖమని అంతా చెప్పుకునేవారు. అంతా ఆమెను ఎదురు రమ్మని కోరేవారు. ఆమె గుడీ పూజారి గారి అమ్మాయి. పెళ్ళయిన ఏడాదికే ఆమె భర్త పాము కరిచి చనిపోయాడు. నీవి మూఢనమ్మకాలని నేను మామూలుగానే చెబితే నువ్వు నమ్మవు కదా! నేను ఎలాగూ ఈ శకునాల లాంటివి నమ్మను. కానీ నీకోసం నమ్మినట్లు నటించి మంగమ్మని నీకు ఎదురు రమ్మని బతిమాలాను. ఆమె ఎదురొస్తే గతంలో ఎలా శుభం జరిగిందో యిప్పుడు వితంతువయ్యాక కూడా శుభం జరిగింది కదా! అలా వితంతువు ఎదురొస్తే అపజయం కలుగుతుందని నమ్మే విషయం తప్పని తేలింది కదా! ఇవేవీ కాదు కానీ అసలు విషయం మరొకటుంది. పది పదిహేను రోజుల బట్టి వారడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పడంతో నీలోఅనుభవం పెరిగింది. అందు వల్ల ఈరోజు నీకుపని దొరికింది' అని సుదీర్ఘంగా చెప్పాడు విశ్వం.

కామేశం ఆరోజు నుండీ మూఢనమ్మకాలు వదిలేశాడు.

(ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం)



Scanned with CamScanner



# లెక్క సరిపోయింది

పార్వతీపురంలో ఉన్న నూరయ్య కిరాణావ్యాపారి. చాలా మంచివాడు. న్యాయమైన ధరలకే అమ్ముతుంటాడని పేరుంది. చుట్టు పక్కల గ్రామాల నుండి చిల్లర వర్తకులు సూరయ్య దగ్గర కొని మారు వర్తకం చేస్తుంటారు. అలాంటివారిలో కాశయ్య ఒకడు.

అతడు చాలారోజుల నుండి నూరయ్య దగ్గర సరుకులు కొంటుండడం వల్ల, వారి మధ్య స్నేహం ఏర్పడింది. అయితే ఈ మధ్య కాశయ్యలో డబ్బుపై అత్యాశ కలిగింది. తొందరగా సంపాదించాలన్న కోరికతో నకిలీ నోట్లు తయారుచేసే ముఠాతో పరిచయం పెంచుకున్నాడు.

సూరయ్య దగ్గర సరుకులు కొన్నప్పుడు వాటిని మంచి నోట్లతో కలిపి యిస్తుండేవాడు. మొదట్లో ఈవిషయం సూరయ్య గ్రహించక

పోయినా తర్వాత తనకు దొంగనోట్లు ఎలా వస్తున్నదీ గ్రహించాడు.

అయితే ఈ విషయం కాశయ్య ముఖాన్నే అడగడం వలన ప్రయోజనం ఉండదని భావించాడు. పైగా, తను కాదంటే బాకీ ఎగ్గొట్టి, యింకొకరిని యిలాగే మోసం చేసే అవకాశం ఉందని ఆలోచించాడు. పోనీ పోలీసులకు చెబుదామంటే ఎంతైనా స్నేహితుడు, ఉన్న పరువు కాస్తా పోతుందని ఆ ప్రయత్నం విరమించాడు.

సూరయ్య పెద్దకొడుకు సత్యం. ఈమధ్యనే పట్టణంలో పెద్ద చదువులు చదివి, కొత్తగా వ్యాపారం పెట్టాలని చూస్తున్నాడు. తండ్రికి సాయంగా దుకాణంలో కూర్చుంటున్నాడు.

ఒకసారి భోజన సమయంలో వారిద్దరి మధ్య కాశయ్య విషయం చర్చకు వచ్చింది. అతని మనసు గాయపడకుండా ఎలా బుద్ధి చెప్పాలని కొడుకును సలహా అడిగాడు సూరయ్య.

"నాన్నగారూ! ఆ విషయం నాకొదిలేయండి. ఈసారి కాశయ్య సరుకులు కొనడానికి వస్తే ఆ బేరం నాకప్పగించండి" అన్నాడు సత్యం.

రెండ్రోజులు పోయిన తర్వాత, కాశయ్య సరుకుల కోసం వచ్చాడు. అతను చెప్పిన జాబితా రాసుకున్న సత్యం..."మీరొక అరగంట అంగడిలో పనిచూసుకుని వస్తే, అన్నీ సంచుల్లో సర్దిపెడతాను" అనిచెప్పి కాశయ్యను పంపించాడు.

ఆ సరుకులన్నీ సత్యం స్వయంగా తనే సంచుల్లో సర్దాడు.

కాశయ్య రాగానే వాటన్నింటినీ అప్పగించాడు. కాశయ్య సరుకులు మూట గట్టుకొని వెళ్ళిపోయాక, సూరయ్య కొడుకుని పిలిచి "నువ్వేదో కాశయ్యకు బుద్ధి చెబుతావనుకుంటే నాకంటే బ్రహ్మాండంగా పొట్లాలు కట్టి ఘనంగా సాగనంపావు" అన్నాడు వెటకారంగా.



Scanned with CamScanner

"మీరు పొరబడుతున్నారు. నేను గట్టిగానే బుద్ధి చెప్పాను" అన్నాడు సత్యం నవ్వుతూ.

"ఎప్పుడు బుద్ధి చెప్పావు! నాకంతా ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు సూరయ్య అయోమయంగా.


దానికి సత్యం స్పందిస్తూ....నాన్నగారూ! నేను కాశయ్యకు యిచ్చింది చీటీలో రాసిన సరుకులను కాదు. చీటీలో జీడిపప్పు, కందిపప్పు, పంచదార, యాలకులు, బెల్లం, ఆవాలు, ఖర్జూరం అని ఉన్నాయి కదా! యివన్నీ ధర అధికంగా వుండే సరుకులు. నేను వాటి స్థానంలో వాటిని పోలి ఉన్న తక్కువ ధరకే లభించే సరుకులను పొట్లం కట్టాను. జీడిపప్పుకు మారుగా శెనగగుళ్ళు, పంచదార బదులు గోధుమ నూక, బెల్లం బదులు తెలగపిండి, ఆవాలుకు బదులు రాగులు, ఖర్జూరం బదులు చింతపండు...యిలా అన్నీ వేరు సరుకులు కట్టాను. అవే లెక్క అప్పజెప్పాను. అతడు యింటికి వెళ్ళి పొట్లాలు విప్పిన మరుక్షణం విషయం తెలుసుకొని, చెమటెక్కుతాడు. కాని ఆ విషయం అడగాలంటే ధైర్యం చాలదు. అతడూ వ్యాపారి కనుక తానిచ్చిన దొంగనోట్లకు మనం దొంగ సరుకులతో సమాధానం చెప్పామని తప్పక గ్రహిస్తాడు. అతను సరుకుల విషయం అడిగితే మనం చెల్లని నోట్ల విషయం అడుగుతామని భయపడతాడు 'తేలు కుట్టిన దొంగ'లా మౌనం వహించి ముందు ముందు మారతాడు"

తగిన విధంగా కాశయ్యకు బుద్ధి చెప్పినందుకు కొడుకుని అభినందించాడు సూరయ్య.

(సాక్షి ఆదివారం అనుబంధం)



Scanned with CamScanner



# పరివర్తన

విశ్వనాథపురంలో వీరయ్య అనే రైతు వుండేవాడు. అతడికి దేవుడు అంటే నమ్మకం లేదు. అతడి ఎదుట దేవుడి ప్రసక్తి తీసుకువస్తే అగ్గిమీద గుగ్గిలం అయ్యేవాడు.

'దేవుడనేవాడు వుంటే కన్పించేవాడు కదా! మరి కనబడనప్పుడు ఎలా నమ్ముతాం?' అని ప్రశ్నించి తనని సమర్థించుకునేవాడు వీరయ్య!

అందుకని ప్రజలు అతని ముందు దేవుని ప్రసక్తి ఎత్తేందుకు భయపడేవారు!

ఆ గ్రామానికి ఒకరోజు ఒక జ్ఞాని వచ్చాడు. అతడు ఎందరి జటిల సమస్యలకో పరిష్కారం సూచించాడు. దాంతో అతడిరాక పెద్ద ప్రచారమైపోయింది.

ఈ విషయం ఆనోటా ఈ నోటా పడి చివరికి వీరయ్యను చేరింది. వీరయ్య యిది మంచి అవకాశంగా భావించి జ్ఞానిని కలుసుకోవాలని నిశ్చయించాడు.

వీరయ్య ఓ ఉదయాన్నే లేచి జ్ఞాని దర్శనం కోసం బయల్దేరాడు. వీరయ్యను రహస్యంగా అనుసరించారు కొందరు వ్యక్తులు!

వీరయ్య జ్ఞానికి నమస్కరించి "అయ్యా! నాదో సందేహం!" అన్నాడు

జ్ఞాని ప్రశాంత వదనంతో "చెప్పు నాయనా!" అన్నాడు.

అప్పుడు వీరయ్య "భగవంతుడు వున్నాడా? లేడా? ఒకవేళ వుంటే మరి కన్పించడేం?" అని ప్రశ్నించాడు.

దానికా జ్ఞాని నవ్వి "ఉన్నాడు నాయనా! దేవుడు లేకపోతే ఈ సృష్టి మొత్తం వుండదు" అన్నాడు శాంతంగా!

ఆ మాటలకు వీరయ్యకు కోపం వచ్చింది. "స్వామీ మీరు చెప్పిన మాటలు యిప్పటికే ఎందరో చెప్పారు. మామూలు మాటల ద్వారా అయితే నేను నమ్మనుగాక నమ్మను" అన్నాడు.

అప్పుడా జ్ఞాని "కాసేపు ఆగు నాయనా! నిరూపిస్తాను" అని చెప్పి కూర్చోమన్నాడు. వీరయ్య ఒక ప్రక్క కూర్చున్నాడు. వీరయ్యను అనుసరించిన వ్యక్తులు కూడా అతడి ప్రక్కనే కూర్చొని జ్ఞాని మాటలు వినదలిచారు.

జ్ఞాని కోసం వచ్చిన మరికొందరు వ్యక్తులకు వారి సమస్యలకు చక్కని సమాధానాలిచ్చి పంపాడాయన! అంతసేపూ ఓపిగ్గా ఎదురు చూశాడు వీరయ్య. అతన్తో బాటు మిగతావారూ ఆత్రంగా చూడసాగారు.



Scanned with CamScanner

జ్ఞాని తన కోసం వచ్చిన వారినందరిని పంపించి ఆ తరువాత వీరయ్యవైపు చూసి నవ్వాడు. వీరయ్యకు లోపల కోపంగా వుంది. తన సందేహం తీర్చడం కోసం యింతసేపు కూర్చుండబెడతాడా? అనుకున్నాడు.

జ్ఞాని తన ప్రక్కనే వున్న సంచిలోనుంచి రెండు రాళ్ళు తీసి వాటిని వీరయ్యకు చూపి "ఇవేమిటి?" అని అడిగాడు.

"అవి చెకుముకి రాళ్ళు" అన్నాడు వీరయ్య. వాటిని రాపిడి చేశాడు జ్ఞాని. వెంటనే అగ్ని పుట్టింది.

అప్పుడు జ్ఞాని "చూడు నాయనా! మొదట ఆ రాళ్ళు మామూలుగా కన్పించాయి కదా. వాటిని రాపిడి చేస్తే అగ్ని పుట్టింది కదా! ఆ రాళ్ళలో అగ్ని వుండి కూడా బయటకు కన్పించనట్లే ఈ జగత్తు అంతా భగవంతుడు వ్యాపించియున్నాడు. వ్యక్తులు ఎవరైతే హృదయం అనే కోవెలలో భక్తి అనే అగ్ని పుట్టించగలుగుతారో వారికి మాత్రమే భగవంతుడు కన్పిస్తాడు. అర్థమయిందా?" అని ప్రశ్నించాడు.

వీరయ్య తన సందేహం తీరిందని అంగీకరిస్తూ "స్వామీ! నా ఈ చిన్న సందేహం తీర్చడం కోసం యింతసేపు కూర్చోబెట్టారు కదా! ఎందువల్ల?" అని ప్రశ్నించాడు.

దానికి చిరునవ్వు నవ్వి యిలా చెప్పాడు జ్ఞాని. "భగవంతుణ్ణి ప్రత్యక్షం చేసుకోవడం ఎంతో కష్టం. ఎన్నాళ్ళో శ్రమించాలి. అలాంటి భగవంతుడి గురించి తెలుసుకోవాలంటే అంతసేపు ఆగగలవో లేదో తెలుసుకోవాలనుకున్నాను. నీవు ఆగగలిగితే నీకా యోగ్యత వున్నట్లు, లేకపోతే నీకు చెప్పకూడదని భావించాను. నీవు ఓపికగా వున్నావు కనుక చెప్పాను" అనడంతో వీరయ్య తృప్తిగా పరివర్తన చెందిన మనసుతో జ్ఞానికి వందనం చేశాడు.

(సప్తగిరి, ఏప్రిల్ 1991)



# స్వయంవరం

వంగ రాజ్యాన్ని పాలిస్తున్న వంశీమోహనుడి ఒక్కగానొక్క కుమార్తె సులోచన. ఆమె పెళ్ళీడు కొచ్చింది. ఆమె సహజంగానే అందమైనది. దానికితోడు యవ్వనంలో వుంది. దాంతో ఆమె అందం మరింత ఆకర్షణీయంగా తయారయ్యింది.

ఆమె వివాహం కోసం స్వయంవరం ఏర్పాటుచేశాడు వంశీ మోహనుడు. ఆ పిలుపు అందుకొని ఎందరో రాజులు హాజరయ్యారు. ఆమె వరమాలతో సహా వచ్చిన రాజులందరినీ చూస్తూ మూడుసార్లు తిరిగింది. అయినా ఎవ్వరూ ఆమెను ఆకట్టుకోలేకపోయారు.

తండ్రిని సమీపించింది సులోచన. "నాన్నగారూ, యిప్పుడేం చేయాలి? నన్ను ఎవరూ ఆకట్టుకోలేకపోయారు" అంది.

వంశీమోహనుడు ఆలోచనలో పడ్డాడు. "ఇది స్వయంవర సభ! నీ యిష్టం వచ్చిన వారిని నీవు వరించాలి! ఎవ్వరూ నచ్చలేదని ప్రకటిస్తే సభలో రాజులు యుద్ధం ప్రకటిస్తారు. అందుకని పెద్దరాజ్యమైన అంగదేశ రాకుమారుణ్ణి వరించు" అన్నాడు కుమార్తెతో.

సభలో అప్పుడే కలకలం బయలుదేరింది.

సులోచన ఇష్టం లేకపోయినా తండ్రి చెప్పినట్లు చేసింది.

అది స్వయంవర సభ అయినా స్వయంవరంలా కాక పెద్దలు కూర్చిన పెళ్ళిలా మారినందుకు బాధపడింది సులోచన!

అంగదేశ రాకుమారుడు అజేయుడితోబాటు వారి రాజ్యానికి బయలుదేరింది సులోచన!

వారిరువురినీ వెంటనే కానుకలతో సాగనంపాడు వంశీమోహనుడు.

వారి రథం ఒక దట్టమైన అరణ్యమార్గం గుండా ప్రయాణిస్తోంది. హఠాత్తుగా ప్రత్యక్షమయ్యారు కొందరు బందిపోటుదొంగలు. రథం చుట్టూ అనుసరిస్తూ వున్న సేవకుల్ని సంహరించారు. రాజకుమారుడిని చుట్టుముట్టేసరికి కత్తిపట్టి పోరాడుతాడనుకున్న అజేయుడు పిరికివాడిలా వారి నుంచి తప్పించుకుని పారిపోయాడు. సులోచన విచారించింది. తన తండ్రి ఇలాంటి పిరికివాడినా వరించమని కోరింది? ఆమె మనసులో అజేయుడి మీద అసహ్యం ఏర్పడింది.

బందిపోటు దొంగలు సర్వాలంకార భూషితయై, బహు సుందరంగా కన్పిస్తున్న సులోచనపై అత్యాచారం చేయబోయారు.

సులోచన భయంతో స్పృహతప్పిపోయింది.

అప్పుడే ఎక్కడ నుంచో ఓ యువకుడు మెరుపు వేగంతో వచ్చి కత్తి



Scanned with CamScanner

ఝళిపిస్తూ బందిపోటులను మట్టి కరిపించాడు. తరువాత సులోచనను స్పృహలోకి తెప్పించాడు.

నెమ్మదిగా కళ్ళు తెరిచిన సులోచన అతణ్ణి చూసి "ఎవరు మీరు? బందిపోట్లు ఎక్కడ? నేను క్షేమంగా వున్నానా?" అని ప్రశ్నించింది.

దానికాయువకుడు నవ్వుతూ "నేను విశాలపుర యువరాజు వీరవర్మను. వంగరాజ్య రాకుమారి సులోచన స్వయంవరానికి వెళ్తున్నాను" అన్నాడు.

దానికి సులోచన "నేనే ఆ రాకుమారి సులోచనను. స్వయంవరానికి యింత ఆలస్యంగా వస్తున్నారు. ఆహ్వాన పత్రం ఆలస్యంగా అందిందా? బందిపోట్లను మీరే తరిమికొట్టారా?" అని అడిగింది.

"అవును. మిమ్మల్ని కలుసుకోవడం సంతోషం! కాని కలుసుకోవడం ఆలస్యం అయినందుకువిచారంగా వుంది" అన్నాడు వీరవర్మ.


"మీరన్న మాటల అర్థం బోధపడింది. నాకు మొదట జరిగిన వివాహం స్వయంవరం కాదు. ఇప్పుడు అతణ్ణి భర్తగా ఆహ్వానించే స్థితిలో లేను. మీకు అంగీకారం అయితే మీ మెడలో వరమాల వేస్తాను" అని చెప్పి అసలు జరిగిన విషయం వివరించింది.

వీరవర్మ సులోచన అందచందాలకు, ఆమె వినయ విధేయతలతో కూడిన మంచి హృదయానికి ముచ్చట పడి "మీరు నాభార్య కావడం నాఅదృష్టం! నేను సిద్ధమే" అన్నాడు.

వారిరువురూ భార్యాభర్తలయ్యారు. ఎలాగైతేనేం సులోచన వివాహం స్వయంవరమే అయింది.

(ఆంధ్రజ్యోతి వారపత్రిక, 22-9-1989)

# పరీక్ష



విష్ణుపురి గ్రామంలో వినాయకయ్య అనే పేదరైతుకు సుందరి కుమార్తె. ఆమె యవ్వనవతి; చక్కనిచుక్క; ఎలాంటి సమస్యలనైనా సునాయాసంగా విప్పగలిగేది!

ఈ విషయం ఈనోటా ఆ నోటా వ్యాపించి, చివరకు ఆ దేశపు రాజు మణికాంతుడ్ని చేరింది. అతడు ఆమెయందాసక్తి గలవాడై ఆమెను పరీక్షించదలిచాడు. వెంటనే ఒక పల్లకీని పంపి, ఆమెను తీసుకు రమ్మన్నాడు.

పల్లకీ ఖాళీగా వచ్చింది. సేవకులు వినయంగా మహారాజుతో, "మహారాజా! స్త్రీ 'పల్లకీ ఎక్కేది పెళ్ళి జరిగేటప్పుడో లేక అత్తవారింటికో లేక యిటు కన్నవారింటికో వెళ్ళేటప్పుడు మాత్రమే! యిప్పుడు ఈ రెండూ నా పట్ల జరగడం లేదు కనుక, పల్లకీ ఎక్కి రావలసిన అవసరంలేదు' అని ఆమె అ37380ది" అని చెప్పారు.

వెంటనే ఒక రౌతును పిలిచి, గుఱ్ఱంపై ఆమెను తీసుకు రమ్మన్నాడు. ఆ రౌతు కూడా తిరిగి వచ్చి, "మహారాజా! 'స్త్రీకి గుఱ్ఱపు స్వారీ తగదు కనుక, నేను గుఱ్ఱంపై రాను. యికపోతే, నీ గుఱ్ఱంమీద కూర్చోవాలనే ఉద్దేశంతో వచ్చినట్లయితే-దానికి నా సమాధానం యిదే-భర్తతో తప్ప పరాయి మగాడితో ఏ స్త్రీ కలసి ప్రయాణం చేయకూడ'దని ఆమె చెప్పమంది!" అన్నాడు.

రాజుమణికాంతుడిలో పట్టుదల హెచ్చింది. ఎలాగైనా ఆమె

తెలివితేటలు పరీక్షించి తీరాలనుకున్నాడు, పై రెండు సంఘటనలను బట్టి ఆమె తెలివైనదేకాక, మాటకారి కూడా అని అర్థమయింది. అయితే, ఎంత తెలివైనదీ-అన్నదే నిరూపించుకోవాలి.

మహారాజు మణికాంతుడు మంత్రి మాధవయ్యను వెంట తీసుకుని ఒకనాడు విష్ణుపురికి ప్రయాణమై వెళ్ళాడు. సుందరి వీరిని చూసి సాదరంగా ఆహ్వానించి, చాపపరిచి కూర్చోమని చెప్పింది. మహారాజు కూర్చోకుండానే, "మేము రమ్మని పల్లకీ పంపినా రాలేదు; గుఱ్ఱంను పంపినా రాలేదు; మరి మేమొస్తే గౌరవిస్తున్నావు-ఏమిటి దీని ఆంతర్యం?" అని ప్రశ్నించాడు.

దానికి సుందరి చిరునవ్వు నవ్వి, "మహారాజా! యింతకుముందు మీరు మాకు రాజైనా, యిప్పుడు మా అతిథి! అతిథిని సత్కరించటం సభ్యతెరిగిన వారి లక్షణం! యికపోతే, మీరు రమ్మని కబురు పంపితే, రాలేక పోవడానికి కారణాలు మూడున్నాయి.

"మీరు నన్ను మీ ఆస్థానానికి రమ్మని ఆజ్ఞాపించలేదు; ఆజ్ఞాపించినప్పుడు రాకపోతే, అది రాజధిక్కారం క్రిందకు వస్తుంది,"

"నేనింకా పెళ్ళికాని యువతిని! మరి మీరు పంపిన పల్లకీగాని, గుఱ్ఱంగానీ పెళ్ళి కాని కన్యలు కూర్చుని ప్రయాణించేంత మేలైనవి కావు. పెళ్ళికాని కన్యలు ఎంత గుట్టుగా ఉంటే అంత మంచిది. అందుకని ఆ వాహనాల మీద నేను రాలేకపోయాను.

ఇకపోతే, మీరు నా తెలివితేటలు పరీక్షించాలను కుంటున్నట్లు తెలిసింది. నా తెలివితేటలను పోటీలలో పెట్టాలని కాని, ప్రచారం పొందాలని కానీ నేను తలచటంలేదు. నేను పేదరైతు బిడ్డను; సామాన్య స్త్రీని. నాకు రాజుగారి గుర్తింపు కూడా అనవసరం-అనుకున్నాను. అందుకే నేను రాలేదు. యిప్పటికైనా కూర్చుంటారా, మహారాజా!" అన్నదామె!

మణికాంతుడు ఆమె వాక్చాతుర్యానికి మనసులోనే మెచ్చుకుని, చాపమీద కూర్చుని "సుందరీ! నీ తెలివితేటలు అమోఘం. నీ తెలివిని పరీక్షించాలని, ముందుగా నేను రాక, పల్లకీని, గుఱ్ఱాన్ని పంపాను. వాటిమీద ఎందుకు రాలేదో యిపుడు నాకు అర్థమైంది" అని అన్నాడు. ఆ తరువాత ఆమెకు మంచి బహుమతులు యిచ్చి వెళ్ళిపోయాడు. (బాలమిత్ర)



Scanned with CamScanner

# కనువిప్పు



విశ్వనాథపురంలో నివసించే శరభయ్య గొప్ప ధనవంతుడే కాని పిసినారి. ఎంగిలి చేత్తో కాకికి విదిలించడు. దానగుణం మాట అటుంచి ఎదుటివారి ప్రాణంపోతుందన్నా సాయపడడు సరికదా వారిని చులకనగా చూసి "కష్టపడి సంపాదించింది అప్పనంగా పెట్టడానికి నేనేం వెర్రివెంగళప్పను కాదు" అనేవాడు. అందుకని గ్రామస్తులెవరూ అతడి సాయం కోరేవారు కాదు.

ఆ గ్రామంలోనే నివాసముంటూ కట్టెలుకొట్టుకుని జీవించేవాడు సోమయ్య. ఊరందరికీ తలలో నాలుకలా వుండేవాడు. అందుకని అతడంటే అందరికీ అభిమానమే. అలాంటి సోమయ్య ఒకసారి ప్రక్కనే ఉన్న అడవిలో కట్టెలు కొట్టి కావిడి మోసుకుని గ్రామానికి తిరిగి వస్తూండగా ఒక విషసర్పం కాటేసింది.

సోమయ్య కట్టెలకావిడిని అక్కడే వదిలేసి పరుగున గ్రామం చేరి విషయం తెలిపాడు. ఆఊరిలో వుండే వైద్యుడు గ్రామాంతరం వెళ్ళాడు. పాముకాటుకి మందు వేసే వైద్యుడు పదిమైళ్ళ దూరంలో వున్న మరో



Scanned with CamScanner

గ్రామంలో మాత్రమే ఉన్నాడు. అక్కడికి ఎలా తీసుకు వెళ్ళాలా అని గ్రామస్తులంతా ఆలోచించారు. వారికి ఒకటే ఉపాయం తోచింది. శరభయ్య వద్ద గుర్రంబండి వుంది. అందులో వేసి సోమయ్యను వైద్యుడి దగ్గరికి చేరిస్తే సకాలంలో మందు వెయ్యవచ్చునని అంతా నిర్ణయించుకుని శరభయ్యని కలిశారు.

"మీరు కనికరించి సహాయం చేయండి. సోమయ్య ప్రాణం నిలబెట్టండి. అతడి కుటుంబానికి అతడే జీవనాధారం. గుర్రపుబండి ఇచ్చి ఆదుకోండి" అని గ్రామస్తులంతా వెళ్ళి శరభయ్యను ఒప్పించడానికి ప్రయత్నించారు.

శరభయ్య ససేమిరా వల్లకాదన్నాడు. గుర్రానికి ఆరోగ్యం బాగాలేదన్నాడు. కట్టెలు కొట్టేవాడు పోతే గ్రామానికి నష్టం ఏమిటి అని ప్రశ్నించాడు.

అప్పుడు గ్రామంలో ఉన్న యువకులు వెదురు కర్రలతో సవారీ తయ్యారుచేసి దానిమీద సోమయ్యను పడుకోబెట్టి కాలినడకన పరుగులు పెడుతూ పారుగూరు చేర్చారు. వైద్యుడు సోమయ్యను పరీక్షించినప్పటికే చనిపోయాడు. మరి కొంచెం సమయం ముందుగా తెచ్చివుంటే ప్రయోజనం ఉండేదన్నాడు వైద్యుడు.

ఈ సంఘటనతో గ్రామస్తులకు శరభయ్య మీద విపరీతమైన కోపం వచ్చింది. "అతడికి అవసరం వచ్చినప్పుడు మనమూ సహాయం చెయ్యవద్దు" అని కూడబలుక్కున్నారంతా.

ఇది జరిగిన కొద్దిరోజులకు శరభయ్య ముద్దులకొడుకుని పోట్లగిత్త కుమ్మేసి కొమ్ములతో దాడిచేసింది. అతడికి గాయాలయ్యి రక్తం ధారగా రాసాగింది. శరభయ్య వైద్యుడి కోసం వెళితే అతడు మరో గ్రామం వెళ్ళాడని తెలిసింది. పారుగూరు తీసుకువెళ్ళాలంటే గుర్రపుబండి తోలే గోవిందుడు పెళ్ళిచేసుకుని అత్తారింటికి వెళ్ళాడు. గ్రామంలో ఎవరైనా సరే సహాయపడతారేమోనని అడిగాడు.

దానికి గ్రామస్తులు " నీవు పుట్టినప్పటినుండీ ఈ రోజువరకు

ఎవ్వరికైనా సాయం చేసిన సంఘటన వుంటే చెప్పు. తప్పక సహాయపడతాం!" అన్నారు. శరభయ్య ఎంత జ్ఞాపకం చేసుకోవాలనుకున్నా ఒక్కటీ జ్ఞప్తికి రాలేదు. సిగ్గుతో తలదించుకున్నాడు. "నాఒక్కగానొక్క కొడుకు చావాల్సిందేనా? మీలో ఎవరైనా సహాయపడరా? మీకు ఎంత కోరితే అంత డబ్బిస్తాను" అన్నాడు ఏడుస్తూ. అయినా ఎవరూ ముందుకు రాలేదు.

అదే సమయానికి సదానందుడు అనే సాధువు ఆ మార్గం గుండా వస్తూ శరభయ్య మాటలు విన్నాడు. ఆ సాధువు గతంలో అతని గురించి విన్నాడు కూడా.

"బంగారు పళ్ళెం అయినా గోడ చేరుపు లేనిదే పడిపోతుంది. నీకు ఎంత డబ్బున్నా మంచితనం లేకపోతే ఏ పనీ జరగదు. నీవు స్వార్థం,పిసినారితనంతో చాలా తప్పులు చేశావు. మనిషిగా పుట్టి ఒక్క మంచిపని చేశావా?" అని అడిగాడు సాధువు.

శరభయ్య అయన కాళ్ళమీద పడి సహాయం చెయ్యమన్నాడు. అప్పుడు సాధువు "ప్రకృతిలో వున్న గాలి, నీరు, చెట్లు నీలాగే స్వార్థంతో ఆలోచించి వుంటే నీ బ్రతుకు ఏమయ్యేది? గాలి పీల్చనిదే ఏ జీవీ క్షణకాలం జీవించలేదు. నీవేమైనా గాలి పీలుస్తున్నందుకు డబ్బు చెల్లిస్తున్నావా? నీరు త్రాగందే ఏ జీవి జీవించ్చలేదు. నీ నుంచి నీరు ఏమైనా ఆశిస్తున్నదా? చెట్లు నీడనిస్తున్నాయి. ఫలాలిస్తున్నాయి. కలపగా మారి పదే పదే ఉపయోగపడుతున్నాయి. కాలి బొగ్గుగా మారుతున్నాయి. అవన్నీ నీలా స్వార్థంగా ప్రవర్తించి వుంటే ఈ జీవకోటి మనుగడ సాగేనా? విచక్షణ, ఆలోచన కలిగి మనిషి జన్మ ఎత్తి మూర్ఖంగా ప్రవర్తించావు. సరిదిద్దుకోలేని తప్పులు చేశావు" అన్నాడు.

శరభయ్య చెంపలు వాయించుకుంటూ "నిజంగా నాకు జ్ఞానోదయం కలిగింది. పదిమందికీ ఉపయోగపడేలా జీవిస్తాను. నన్ను మన్నించండి" అన్నాడు పశ్చాత్తాపంతో.

సాధువు తనకి తెలిసిన వైద్యం చేసి శరభయ్య కొడుకుని రక్షించాడు. ఈ తరువాత పదిమందికీ ఉపయోగపడే పనులు చేస్తూ శరభయ్య మంచి మనిషిగా పేరు తెచ్చుకున్నాడు. (ఆంధ్రభూమి వారపత్రిక)



## చిన్ని చిన్ని గుండెలపై కథల శిలాక్షరాలను లిఖించిన శిల్పి నారంశెట్టి ఉమామహేశ్వరరావు

1981 వ సంవత్సరములో 'మేలెరిగిన మనిషి' బాలజ్యోతి అనుబంధ నవల ద్వారా శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు గారి రచనా జీవితం ప్రారంభమయ్యింది. ఒకసారి కథానికై కనిపిస్తాడు. ఇంకొకసారి గేయమై ప్రభవిస్తాడు. మరోసారి కవిత్వమై విరబూస్తాడు. వేరొకసారి విమర్శకుడై నినదిస్తాడు.

ఇలా సాహిత్యంలోని ప్రక్రియలన్నీ ఆయన కలానికి కరతలామలకమే. కవిగా, రచయితగా అఖిలాంధ్రులకు ఆయన సుపరిచితమే.

ఉమామహేశ్వరరావు నిష్కల్మషమైన వాడు. ముక్కుకు సూటిగా పోయే తత్వమున్న వాడు. మిత్రులను ఆప్యాయంగా ఆదరిస్తాడు. అన్నిటినీ మించి మల్లెపువ్వు వంటి చిరునవ్వుల పరిమళం వున్నవాడు.

అయిదువందల దాకా బాలల పెద్దకథలు రాసినా అవగింజంతైనా అహంలేని అక్షర నిగర్వి. పుట్టి పెరిగిన పల్లెటూరినీ, అక్కడి ప్రజల స్థితిగతులను సునిశితంగా పరిశీలించి మంచిని పెంచాలన్న సదాశయంతో కథనరంగంలోకి అడుగుపెట్టిన అక్షరసైనికుడు.

చూపు చురకత్తి. మెదడు అయస్కాంతం. మాట మధురం. మనసు వెన్న. అందుకే ఉమామహేశ్వరరావు, కవి రచయిత కాగలిగాడు. సంగీత నిలయమైన విజయనగరానికి సగర్వంగా నేను సైతం అంటూ సాహిత్యాలయానికి అక్షరయిటుకల్ని పేర్చాడు. పేరుగాంచాడు.

రాసికన్నా వాసికి ప్రాముఖ్యతనిస్తూ పనికొచ్చేదే రాస్తూ, పదిమందికీ అందిస్తూ మున్ముందుకు సాగిపోతున్నాడు. తోటికవుల, సాటి రచయిత, పాఠకుల మన్ననలూ పొందుతున్నాడు. బాలలన్నా, బాలల కథలన్నా ప్రాణంతో సమానంగా భావించే ఉమామహేశ్వరరావు కథలు నీతిని బోధిస్తాయి. మంచిని పెంపొందిస్తాయి. పెద్దలను సైతం ఆకర్షిస్తాయి. ఆలోచింపజేస్తాయి.

ఈ బహుముఖ ప్రజ్ఞాశాలికి వచ్చిన బహుమతులెన్నో....

ఈ అక్షర వరపుత్రుడు అందుకున్న అవార్డులెన్నెన్నో.....

సహస్రాబ్ది అవార్డు వరించిన ఉమామహేశ్వరరావుని వరించడానికి ఎన్నో అవార్డులు వరసలో వుంటాయని, వున్నాయని కాంక్షిస్తూ, మనసారా అభినందిస్తూ, ఆయన కలంనుంచి మరెన్నో సమాజహితం కోరే రచనలు రావాలని కోరుకుంటున్నాను.

శుభాభినందనలతో......

సాహిత్య ప్రకాశ్
కవి, రచయిత,
టి.వి. సంభాషణల రచయిత, హైదరాబాద్.

Scanned with CamScanner